ఇంజనీర్ల బదిలీ

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 26: హంద్రీనీవా సుజల స్రవంతి పథకం సర్కిల్-2 ఎస్‌ఈ దేసేనాయక్ బదిలీ అయ్యారు. నెల్లూరు డ్రైనేజీ డివిజన్ ఈఈగా ఆయనను బదిలీ చేశారు. ఆయన హంద్రీనీవా డివిజన్-7 ఈఈగా ఉంటూ, ఇన్‌చార్జి ఎస్‌ఈగా కొనసాగారు. ఆయన స్థానంలో ఎవరినీ నియమించలేదు. హెచ్చెల్సీ డిప్యూటీ ఎస్‌ఈ సునీల్‌నాయక్‌ను తిరుపతి తెలుగుగంగ చీఫ్ ఇంజనీర్ కార్యాలయం డిప్యూటీ సీఈగా బదిలీ చేశారు. మైనర్ ఇరిగేషన్ ఐబీ డివిజన్‌లో ఈఈగా ఉన్న ప్రతాప్‌ను కేసీ కెనాల్ నంద్యాల ఈఈగా బదిలీ చేశారు. హెచ్చెల్సీ లోకలైజేషన్ ఈఈగా కర్నూలు మైనర్ ఇరిగేషన్ రెడ్డిశేఖర్ రెడ్డిని బదిలీ చేశారు.

లావణ్య ఆస్పత్రి సీజ్


లావణ్య ప్రైవేట్ ఆస్పత్రిని సీజ్ చేయిస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈబీ దేవి

అనంతపురం టౌన్, సెప్టెంబరు 26: నగరంలోని లావణ్య ప్రైవేట్ ఆస్పత్రిని జిల్లా వైద్యాధికారులు గురువారం సీజ్ చేశారు. కూడేరు మండలం హంసాయపల్లికి చెందిన రాధమ్మ అనే మహిళకు గర్భసంచి ఆపరేషన్ చేసే సమయంలో డాక్టర్ రమణానాయక్ ఆమె మూత్రనాళాన్ని తొలగించారు. దీంతో ఆమె కిడ్నీలు దెబ్బతిని, పరిస్థితి విషమించడంతో మరో ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించి చికిత్స చేయించారు. మూడు నెలల తర్వాత మరో ఆపరేషన్ చేయాలని వైద్యులు సూచించారు. బాధిత మహిళ, ఆమె కుటుంబ సభ్యులు లావణ్య ఆస్పత్రి వద్ద ఆందోళన చేయడంతోపాటు కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్‌కు ఫిర్యాదు చేశారు. డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈబీ దేవి విచారించి.. నిర్ధారించుకున్నారు. క్లినిక్‌కు పర్మిషన్ తీసుకుని ఆస్పత్రి నడుపుతున్నారని, ఆపరేషన్లు చేస్తున్నారని గుర్తించారు. ఈ విషయాలను కలెక్టరు సహా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. నలుగురు వైద్యుల కమిటీ నివేదిక వచ్చిన తరువాత డాక్టర్ రమణా నాయక్‌పై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్‌ఓ తెలిపారు.

బాల్య వివాహాలు జరగకూడదు

కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్


సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టరు వినోద్ కుమార్

అనంతపురం టౌన్, సెప్టెంబరు 26: జిల్లాలో ఎక్కడా బాల్య వివాహాలు జరగకుండా ప్రత్యేక నిఘా పెట్టాలని అధికారులను కలెక్టరు డాక్టర్ వినోద్ కుమార్ ఆదేశించారు. బాల్య వివాహాలపై జిల్లా అధికారులు, కమిటీతో కలెక్టరేట్‌లో గురువారం సమీక్ష నిర్వహించారు. బాల్యవివాహాలు నివారణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారని అడిగి ఆరా తీశారు. బాల్య వివాహాలు చట్ట విరుద్ధమని, చిన్నతనంలో పెళ్లిళ్లు చేస్తే బాలికల జీవితాలు నాశనమవుతాయని అన్నారు. వీటిపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. బాల్య వివాహాలు జరిగే ప్రాంతాలపై నిరంతరం నిఘా ఉంచాలని ఆదేశించారు. అందరూ సమన్వయంతో పనిచేసి, జిల్లాలో ఒక్క బాల్య వివాహంకూడా జరగకుండా చూడాలని అన్నారు. రెవెన్యూ, డీఆర్‌డీఏ, ఐసీడీఎస్, విద్యాశాఖ అధికారులు చట్టం గురించి సిబ్బందికి, ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. సమావేశంలో ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, జడ్పీ సీఈఓ ఓబులమ్మ, డీఈఓ వరలక్ష్మి, డీవీఈఓ వెంకటరమణనాయక్, డీపీఆర్‌ఓ గురుస్వామిశెట్టి, రెడ్స్ సంస్థ డైరెక్టర్ భానుజా తదితరులు పాల్గొన్నారు.

అడ్మిషన్ కేసులు బయటకు వెళితే చర్యలు

సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు


ఆర్‌ఎంఓలకు సూచనలు ఇస్తున్న సూపరింటెండెంట్

అనంతపురం టౌన్, సెప్టెంబరు 26: జిల్లా సర్వజన వైద్యశాలలో అడ్మిట్ అయిన కేసులు ప్రైవేట్ ఆస్పత్రులకు వెళుతున్నాయనే ఆరోపణలు వస్తున్నాయని, వీటిపై నిఘా పెట్టాలని ఆర్‌ఎంఓలను సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు ఆదేశించారు. జనరల్ సర్జన్ డాక్టర్ రమణా నాయక్ తాను నిర్వహిస్తున్న ప్రైవేట్ ఆస్పత్రిలో ఓ మహిళకు గర్భసంచి ఆపరేషన్ చేసే సమయంలో మూత్రనాళాన్ని తొలగించడం వివాదాస్పదమైంది. ఈ నేపథ్యంలో ఆర్‌ఎంఓలు డాక్టర్ పద్మజ, డాక్టర్ హేమలత, డాక్టర్ శివకుమార్‌తో సూపరింటెండెంట్ గురువారం సమావేశం నిర్వహించారు. అడ్మిషన్ అయిన రోగులకు అవసరమైన వైద్యసేవలు ఇక్కడే అందేలా చూడాలని అన్నారు. ఇక్కడ చేయలేమని ఏవో సాకులు చెప్పి ప్రైవేట్ ఆస్పత్రులకు పంపడం మంచి పద్ధతి కాదని అన్నారు. అలా బయటకు పంపే వైద్యులపై నిఘా వేయాలని సూచించారు. పెద్దాసుపత్రి నుంచి డిశ్చార్జి అయిన తరువాత ప్రైవేటు ఆస్పత్రుల్లో చేరే రోగుల వివరాలను ఎప్పటికప్పుడు సేకరించాలని సూచించారు. గతంలో సర్జన్ విభాగం నుంచి ఎక్కువ కేసులు బయటకు వెళుతున్నాయన్న ప్రచారం ఉండేదని, ఇటీవల గైనిక్ విభాగంపై అలాంటి ఆరోపణలు వస్తున్నాయని అన్నారు. హెచ్‌ఓడీలు వైద్యులతో సమావేశం నిర్వహించి.. అప్రమత్తం చేయాలని ఆదేశించారు. అనవసరంగా కేసులను బయటకు పంపినట్లు తేలితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఏఎంసీని నిత్యం పర్యవేక్షించాలని, ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఆర్‌ఎంఓ డాక్టర్ శివకుమార్‌కు సూచించారు. కీలక విభాగాలను రోగులు, వారి సహాయకులు సులభంగా గుర్తించేందుకు అవసరమైన సూచికలు ఏర్పాటు చేయించాలని ఆయనకు సూచించారు.

దారి కోసం డబ్బులు..!



• గుంతలను పూడ్చేందుకు రూ.19.92 కోట్లు • అధికారులు అడిగినంత సొమ్ము ఇచ్చిన ప్రభుత్వం

వంద రోజుల్లో పనులు పూర్తి చేయాలని ఆదేశం

ఉత్సాహంగా సాగుతున్న టెండరు ప్రక్రియ


దామాజిపల్లి- తాడిపత్రి రోడ్డు ఇలా..

అనంతపురం సిటీ, సెప్టెంబరు 26: వైసీపీ ఐదేళ్ల పాలనలో శిథిలమైన రహదారులను బాగు చేసేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. ఆర్‌అండ్‌బీ రోడ్ల మరమ్మతులపై దృష్టిసారించింది. సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సమీక్షలు నిర్వహించి, జిల్లాల వారీగా నివేదికలు తీసుకున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా (రాష్ట్ర రహదారులు, జిల్లా మేజర్ రోడ్లు) 68 పనులకు ప్రతిపాదనలు పంపారు. మొత్తం 383 కి.మీ. మేర రోడ్లు గుంతలమయమైనట్లు గుర్తించారు. మరమ్మతులకు రూ19.92 కోట్లు కావాలలని ప్రభుత్వానికి నివేదిక పంపారు. ఆ వెంటనే ప్రభుత్వం ఎస్‌డీఆర్‌ఎఫ్ (రాష్ట్ర విపత్తు ఉపశమన నిధి) కింద రూ.19.92 కోట్లు విడుదల చేసింది. వంద రోజుల్లో ఈ పనులను పూర్తి చేయాలని ఆదేశించింది.

అడిగినంత ఇచ్చారు..

ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా.. అధికారులు అంచనా నివేదిక పంపితే అందులో కొంత కోసిగానీ ఇవ్వవు. ఒక్కోసారి మొండిచేయి చూపుతాయి. కానీ టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారులు అడిగినంత మొత్తాన్ని ఇచ్చింది. ఉమ్మడి జిల్లాలో 383 కిలో మీటర్ల మేర రోడ్లు దెబ్బతిన్నాయని, మరమ్మతులకు రూ.19.92 కోట్లు అవసరమని అధికారులు జూలైలో నివేదించారు. ఇందులో పైసా కూడా తగ్గించకుండా వందశాతం నిధులను ప్రభుత్వం మంజూరు చేయడం విశేషం. రాష్ట్ర ప్రభుత్వం ఉమ్మడి జిల్లాకు కేటాయించిన నిధులలో అనంతపురం జిల్లాకు 39 పనులకు (269 కి.మీ.) రూ.13.92 కోట్లు, శ్రీసత్యసాయి జిల్లాలో 29 పనులకు (114 కి.మీ.) రూ.6 కోట్లు కేటాయించింది. అక్టోబరు, నవంబరు, డిసెంబరు నెలల్లో పనులను పూర్తి చేయాలని ఆదేశించింది. దీంతో రెండు జిల్లాల ఆర్‌అండ్‌బీ అధికారులు పనులపై దృష్టి సారించారు. ఇప్పటికే టెండర్లను పిలిచారు. కాంట్రాక్టర్లు పనులను దక్కించుకునేందుకు ఉత్సాహంగా ముందుకు వస్తున్నారు.


బెకుగుప్ప-సొల్లాపురం రోడ్డు ఇలా..

ఐదేళ్లు నిర్లక్ష్యం..

వైసీపీ ఐదేళ్ల పాలనలో రహదారుల గురించి పట్టించుకోలేదు. ప్రజలు అవస్థల నడుమ ప్రయాణం చేయాల్సి వచ్చింది. కొత్త రోడ్ల సంగతి అటుంచితే.. గుంతలను కూడా పూడ్చింది లేదు. ఆర్‌అండ్‌బీ రోడ్ల పనులకు అరకొరగా నిధులు కేటాయించారు. కానీ ఎక్కడా ఆశించిన స్థాయిలో పనులు సాగలేదు. ఏళ్ల తరబడి బిల్లులు పెండింగ్‌లో పెట్టడమే దీనికి కారణమని కాంట్రాక్టర్లు విమర్శిస్తున్నారు. రికార్డుల ప్రకారం వైసీపీ ప్రభుత్వం రూ.100 కోట్ల వరకు బిల్లులను కాంట్రాక్టర్లకు చెల్లించలేదు. కూటమి ప్రభుత్వం ఆ బకాయిలను చెల్లించాలని కోరుతున్నారు.


దెబ్బతిన్న రాయలచెరువు- పెద్దఎక్కలూరు రోడ్డు

మొదలైన సందడి..

కూటమి ప్రభుత్వం నిధులను కేటాయించగానే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కాంట్రాక్టర్లలో సందడి మొదలైంది. ఆర్ అండ్‌బీ అధికారులు టెండరు ప్రక్రియను వేగంగా పూర్తి చేసేందుకు శ్రీకారం చుట్టారు. ఎస్‌ఈ స్థాయిలో- 10, ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ (ఈఈ) స్థాయిలో 58 వర్కులు ఉన్నాయి. ఎక్కడికక్కడ టెండర్లను పిలిచారు. వైసీపీ పాలనలో విసిగిపోయిన కాంట్రాక్టర్లు కూటమి ప్రభుత్వంపై నమ్మకంతో ఉత్సాహంగా టెండర్లు వేస్తున్నారు.

అడిగినంత ఇచ్చారు..



ఆర్‌అండ్‌బీ రహదారుల మరమ్మతులకు ప్రభుత్వం కోరినన్ని నిధులను మంజూరు చేసింది. ఇది శుభ పరిణామం. ప్రజలకు ఎంతో ఉపయోగకరం. త్వరలో టెండర్ల ప్రక్రియను పూర్తి చేసి, ప్రభుత్వ ఆదేశాల మేరకు వంద రోజుల్లో ఈ పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటాం.

- ఓబులరెడ్డి, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ

మత్తుకు బానిస కావొద్దు: జేసీపీఆర్


మాట్లాడుతున్న జేసీపీఆర్

తాడిపత్రి, సెప్టెంబరు 26: మత్తు పదార్థాలకు యువత బానిస కావొద్దని మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి సూచించారు. తాడిపత్రిని మత్తుపదార్థాల రహితంగా తీర్చిదిద్దుకుందామని సోషల్ మీడియా వేదికగా గురువారం పిలుపునిచ్చారు. తాడిపత్రిలో గంజాయి వాడకం ఎక్కువైందని ఇటీవల పలువురు తనకు సమాచారం ఇస్తున్నారని అన్నారు. ఇది పార్టీలకు సంబంధించిన అంశం కాదని అన్నారు. గంజాయి వాడుతున్నవారు ఏ పార్టీ లో ఉన్నా ఊరు చెడిపోయే ప్రమాదం ఉందని, అలాంటి అలవాట్లను మానుకోవాలని హితవు పలికారు. మత్తుపదార్థాల వల్ల వచ్చే ఆనందం తాత్కాలికమని, దీనివల్ల ఆరోగ్యం దెబ్బతింటుందని, జీవితాలు నాశనమౌతాయని అన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలపై నిఘా వేయాలని సూచించారు. గంజాయి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ చేయి కలపాలని కోరారు. తాను తాడిపత్రికి వచ్చిన తర్వాత పోలీసుల సహకారంతో గంజాయి విక్రయదారులపై పీడీ చట్టం కింద కేసులు నమోదు చేయిస్తామని హెచ్చరించారు.

అడవి కాదు.. కాలువ..!

- పొదలతో నిండిన పీఏబీఆర్ కుడికాలువ
- నిర్వహణకు నిధులివ్వని వైసీపీ ప్రభుత్వం
- వేలాది ఎకరాల్లో ఎండిపోయిన పంటలు
- నీరు వదిలితే బోరుబావులకు జీవం


కుడికాలువకు ఇరువైపులా ఏపుగా పెరిగిన కంపచెట్లు

కూడేరు, సెప్టెంబరు 26: పీఏబీఆర్ డ్యాం నుంచి ధర్మవరం చెరువుకు నీరు తరలించే కుడికాలువ నిర్వహణను వైసీపీ హయాంలో నిర్లక్ష్యం చేశారు. దీంతో కాలువ మొత్తం ముళ్లపొదలతో నిండింది. చూడటానికి చిట్టడవిని తలపిస్తుంది. దాదాపు 112 కి.మీ. పొడవు ఉన్న ఈ కాలువ మరమ్మతులకు గడిచిన ఐదేళ్లలో పైసా ఇవ్వలేదు. ప్రతి ఏటా నిధుల కోసం అధికారులు నివేదికలు పంపడం.. అవి బుట్టదాఖలు కావడంతోనే ఐదేళ్లు గడిచిపోయింది. కాలువకు ఇరువైపులా కంపచెట్లు పెరిగినందున నీరు వదిలితే గండ్లు పడే ప్రమాదం ఉంది. కూడేరు మండలం మరుట్ల చెరువు నుంచి తాడిమర్రి మండలం అగ్రహారం చెరువు వరకు కాలువ కింద దాదాపు 49 చెరువులు ఉన్నాయి. కుడికాలువకు నీరు వదిలితే దాదాపు 7500 ఎకరాల ఆయకట్టు సాగవుతుంది. బోరుబావుల కింద 50 వేల ఎకరాలకు నీరు అందుతుంది.

నష్టాల మూట

పీఏబీఆర్ డ్యాం నుంచి కుడి కాలువకు నీరు వదిలితే చెరువులు నిండుతాయి. ఆయకట్టు సాగులోకి వస్తుంది. చెరువుల పరిధిలో భూగర్భ జలాలు పెరిగి.. బోరుబావులు జీవం పోసుకుంటాయి. గత ఏడాది కుడికాలువకు నీరు వదలకపోవడంతో బోరుబావులు చాలామటుకు ఎండిపోయాయి. నీరు లేక చీనీ, ద్రాక్ష పంటలు దెబ్బతిన్నాయి. వాటిని కాపడుకునేందుకు ట్యాంకర్లతో నీటి తడులను అందించారు. బోరు బావులు అడుగంటిపోవడంతో వేరుశనగ, టమోటా, మిరప, అలసంద తదితర పంటలు ఎండిపోయాయి. చెరువులు ఎండిపోవడంతో పశువులకు గ్రాసం కొరత ఏర్పడింది. చాలా మంది రైతులు పశువులను అమ్ముకున్నారు.

ఈ సారైనా వదిలేరా..?

తుంగభద్ర డ్యాం నిండటంతో అధికారులు పీఏబీఆర్‌కు నీటిని విడుదల చేశారు. తుంగభద్ర డ్యాం నుంచి లింక్ చానల్ ద్వారా 400 క్యూసెక్కుల నీరు పీఏబీఆర్‌కు వస్తోంది. ప్రస్తుతం డ్యాంలో 2.125 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కుడికాలువకు నీరు వదలాలంటే డ్యాంలో 1.12 టీఎంసీల కంటే ఎక్కువ నీరు ఉండాలి. ప్రస్తుతం డ్యాంలో అంత కంటే ఎక్కువగానే నీరుంది. కానీ కుడికాలువకు డిసెంబరులో నీటిని వదలడం ఆనవాయితి. ఈ లోగా విద్యుదుత్పత్తికి డ్యాం నీటిని వాడుతారు. డిసెంబరు వరకూ నీటి నిల్వలను కాపాడుకుని, కుడి కాలువకు నీరు వదిలితే వేలాది ఎకరాల ఆయకట్టుకు మేలు జరుగుతుంది. బోరు బావులు రీచార్జి అవుతాయి. గత ఏడాది డ్యాంలో నీరు లేని కారణంగా కాలువకు వదలలేదు. ఈ ఏడాదైనా తప్పనిసరిగా నీరు వదలాలని రైతులు కోరుతున్నారు.

నీరు వదలాలి..



కుడి కాలువకు నీరు వస్తే బోరుబావుల్లో నీరు పెరిగి పంటలు సాగు చేసుకునే వీలు ఉంటుంది. గత సంవత్సరం నీరు రాకపోవడంతో బోరుబావులు ఇంకిపోయాయి. భూములను సాగు చేయలేకపోయాము. ఈ ఏడాదైనా నీరు వదిలితే బోరు బావు లు రీచార్జి అవుతాయి. పంటలను సాగు చేస్తే పశువులకు గ్రాసం కూడా దొరుకుతుంది. - వెంకటేష్, కూడేరు

కుడికాలువే ఆధారం..




పీఏబీఆర్ నుంచి కుడికాలువ నీరు వదిలితే మా బోర్లలో నీరు సమృద్ధిగా ఉంటుంది. పంటలు బాగా పండుతాయి. గత ఏడాది కాలువకు నీరు రాకపోవడంతో బోర్లలో నీరు తగ్గిపోయింది. కాలువకు సమీపంలో మా బోర్లు ఉన్నాయి. ఈ ఏడాదైన నీరు వదిలి రైతులను ఆదుకోవాలి.

- రమణ, కూడేరు

రూ.10 నాణేలను తీసుకోకపోతే చర్యలు: కలెక్టర్



అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 26: పది రూపాయల నాణెం చెల్లుబాటు అవుతుందని, ఎవరైనా తీసుకోలేదని ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవని కలెక్టర్ వినోద్‌కుమార్ హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం, రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా ముద్రించిన, చెలామణిలో ఉన్న నాణేలను తీసుకోవాలని సూచించారు. ప్రజల లావాదేవీల అవసరాలను తీర్చడానికి కొత్త డినామినేషన్‌లో నాణేలు విడుదలవుతుంటాయని అన్నారు. నాణేలు ఎక్కువ కాలం చెలామణిలో ఉంటాయని, వేర్వేరు సమయాలలో విడుదలైన వాటి డిజైన్లు, పరిమాణాలలో తేడాలు ఉంటాయని అన్నారు. ప్రస్తుతం రూ.1, రూ.2, రూ.5, రూ.10 నాణేలు, థీమ్, డిజైన్లలో తేడాలు ఉన్నాయని తెలిపారు. ఈ నాణేల వాస్తవికతపై కొన్ని వర్గాల్లో అనుమానాలు ఉన్నాయని, దీంతో కొందరు వ్యాపారులు, దుకాణాదారులు నాణేలు తీసుకోవడం లేదనే ఫిర్యాదులు ఉన్నాయని అన్నారు. ఆర్‌బీఐ నిబంధనల ప్రకారం ప్రతి ఒక్కరూ చెలామణిలో ఉన్న నాణేలను స్వీకరించాల్సిందేనని స్పష్టం చేశారు. ప్రత్యేకించి రూ.10 నాణేలను తీసుకోకపోతే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.



లేపాక్షి ఆలయం వ్యూ

అహో..!

టూరిజం హబ్‌గా జిల్లా
అన్నిప్రాంతాల్లో ప్రపంచ ప్రసిద్ధ పర్యాటక ప్రదేశాలు

నేడు ప్రపంచ పర్యాటక దినోత్సవం

శ్రీరాముడే నడయాడిన నేల లేపాక్షి..
శిల్పకళల కాణాచి..
ఆంధ్రభోజుడు విడిది చేసిన పెనుకొండ..
విజయనగర వైభవాల కొండ..
ఎకరాల్లో విస్తరించిన తిమ్మమ్మ మర్రిమాను..
ప్రపంచలోనే పెద్దదిగా రికార్డు..
లక్షలాది మందికి ఇలవేలుపు
ఖాద్రీశుడు కొలువైన కదిరి..
హెంజేరు సిద్దేశ్వరుడు..
పెనుకొండలో నిద్రిస్తున్న కుంభకర్ణుడు..
విశ్వ మానవాళికి పంచసూత్రాలు
బోధించిన పుట్టపర్తి..
విదేశీ పక్షులకు ఆతిథ్యమిచ్చే వీరాపురం..
ధర్మవరం పట్టుచీరలు..
నిమ్మలకుంట తోలుబొమ్మలు..
ఒక్కటేంటి.. అన్నీ.. అన్నీ.. ప్రపంచ ప్రసిద్ధే..
అద్భుతాలే.. పరమాద్భుతాలే..
అహో.. అనిపించే.. అపురూప ప్రదేశాలే..
మంత్రముగ్ధులను చేసే శిల్పకళాసౌరభాలే..
జిల్లా నలుమూలలా పర్యాటక క్షేత్రాలే..
ప్రపంచమే జిల్లా పర్యాటకం వైపు
తొంగిచూస్తోంది..
- పుట్టపర్తి, (ఆంధ్రజ్యోతి)



అబ్బురపరిచే శిల్పసంపద

ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఎందరో దర్శించాలనుకునే ప్రదేశం లేపాక్షి. విజయనగర రాజుల కాలంలో లేపాక్షి వీరభద్రస్వామి ఆలయాన్ని నిర్మించారు. ఆలయంలో మొత్తం 878 స్తంభాలు ఉన్నాయి. 246 స్తంభాలపై ఎన్నో శిల్ప కళాకృతులు ఆకట్టుకునేలా ఉన్నాయి. లేపాక్షి ఆలయంలో అద్భుతమైన తైలవర్ణ చిత్రాలు ప్రత్యేక ఆకర్షణగా కనిపిస్తాయి. వీరభద్రస్వామి ఆలయాన్ని ఏడు ప్రాకారాలతో భారీఎత్తున నిర్మించారు. బండపై నిరంతరం నీరు ప్రవహించే సీతాదేవి పాదం, తాండమేశ్వర లింగం ప్రత్యేకాకర్షణ. వీరభద్ర స్వామి ఆలయం ఆగ్నేయ దిశలో ఉన్న ఎత్తైన శివ లింగానికి ఏడు శిరస్సుల నాగేంద్రుడు మూడుసార్లు చుట్టుకుని, కవచంగా ఉన్నట్లు దర్శనమిస్తాడు. ఆలయంలో ప్రధానంగా చెప్పుకోవాల్సింది వేలాడే స్తంభం. ఆలయాన్ని ఇటీవల జీ20 దేశాల ప్రతినిధుల బృందం సందర్శించింది. ఆలయ నిర్మాణంపై ఆశ్చర్యం వ్యక్తం చేసింది. గతేడాది యునెస్కో తాత్కాలిక జాబితాలో లేపాక్షికి చోటు దక్కింది. లేపాక్షి ఆలయాన్ని ఇటీవల ప్రధాని నరేంద్ర మోదీ సందర్శించారు. దీంతో దేశవ్యాప్తంగా గుర్తింపు దక్కింది.

అతిపెద్ద నంది: లేపాక్షికి తూర్పు నుంచి ప్రవేశ మార్గంలోనే ఆలయానికి ఈశాన్య దిశలో లేపాక్షి-హిందూపురం ప్రధాన రహదారికి ఆనుకుని అతి పెద్ద ఏకశిలా నంది విగ్రహం కనిపిస్తుంది. దీనిని లేపాక్షి బసవయ్యా అంటారు. బసవయ్యా మెడలో పూసల హారాలు, గంటలు, రెక్కించిన చెవులు, లేవబోతూ కాలుని సరిచేసుకుంటున్న భంగిమ, మెడలో గండబేరుండ హారం, రాయలవారి రాజ ముద్రిక, కీర్తి ముఖంగా ఉన్న నంది, చూపరులను ఎంతగానో ఆకట్టుకుంటాయి. నంది దృష్టి ఆలయంలో నాగేంద్రుని చుట్టులో ఉన్న శివలింగాన్ని దర్శిస్తున్నట్లుగా అనిపిస్తుంది. కుడివైపు మెడ దగ్గర వైపు నుంచి చూస్తే ఆలయంలోని నాగేంద్రుని పడగ కనిపిస్తుంది. ఆలయంలోని శివలింగానికి, నందీశ్వరుడికి 200 మీటర్ల దూరం ఉంటుంది.



ప్రపంచ ఆధ్యాత్మిక కేంద్రం

సత్యసాయి అవతరణ, బోధనలు, ప్రేమతత్వంతో కుగ్రామంగా ఉన్న పుట్టపర్తి ప్రపంచ ఆధ్యాత్మిక కేంద్రంగా పేరొందింది. సత్యసాయి ఆధ్యాత్మిక బోధనలు ప్రపంచవ్యాప్తంగా విస్తరించాయి. సత్యసాయి బోధనల్లో ప్రేమతత్వం, సేవలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. సత్యం, ధర్మం, శాంతి, ప్రేమ, అహింస అనే బోధనలతో కోట్లాదిమందికి సత్యసాయి గురువుగా మారారు. 150 దేశాలకు చెందిన అన్ని మతస్తులవారు.. సత్యసాయి దర్శనానికి రావడంతో పర్యాటక కేంద్రంగా కూడా ప్రత్యేక గుర్తింపు వచ్చింది. 2011లో సత్యసాయి శివైక్యం తరువాత సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు. మహాసమాధి దర్శనానికి ప్రపంచ నలుమూలల నుంచి నిత్యం భక్తులు వస్తుంటారు.



శ్రీఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం

అచ్యుతరాయలు నిర్మించిన ఆలయం

హరిహరరాయలు, బుక్కరాయులకు 12వ శతాబ్దంలో లక్ష్మీనరసింహ స్వామి స్వప్నంలో కనిపించి చెప్పడంతో ఖాద్రీ వృక్షం కింద ఉండే పుట్టలో ఉన్న సాలగ్రామాలను ప్రతిష్ఠించారు. అవి కాలక్రమేణా అంతరించిపోయాయి. 15వ శతాబ్దంలో విజయనగరరాజులైన అచ్యుతదేవరాయులు.. కదిరి పట్టణంలో స్వామివారి ఆదేశం మేరకు అష్టబాహువులతో హిరణ్యకశిపుని సంహరించేలా ఉండే విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. నేటికీ పూజలందుకుంటోంది. తెలుగురాష్ట్రాల నుంచే కాక కర్ణాటక, తమిళనాడు నుంచి నిత్యం వేలాది మంది భక్తులు తరలివచ్చి, స్వామివారిని దర్శించుకుంటున్నారు. ఏటా శ్రీవారి బ్రహోత్సవాల్లో లక్షలాదిమంది పాల్గొంటారు. దేశంలోనే మూడో అతి పెద్దవైన రథం ఖాద్రీశుడిది.



ప్రపంచంలోనే పెద్దది..

ప్రపంచంలోనే అతి పెద్ద చెట్టుగా నంబులపూలకుంట మండలంలోని గూటిబైలులో ఉన్న తిమ్మమ్మ మర్రిమాను గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకుంది. 500 ఏళ్ల వయసు కలిగిన ఈచెట్టు దాదాపు 8 ఎకరాల్లో విస్తరించి ఉంది. తిమ్మమాంబ నాటిన ఈచెట్టు శాఖోప శాఖలుగా విస్తరించిందని భక్తులు చెబుతారు. చెట్టుకిందే తిమ్మమాంబ ఆలయం నిర్మించారు. ప్రతి మహాశివరాత్రికి ఇక్కడ రథోత్సవం, జాగరణ నిర్వహించడం ఆనవాయితీ. ప్రపంచఖ్యాతి పొందిన మర్రిమాను చూడడానికి నిత్యం వందలాది మంది భక్తులు వస్తుంటారు.



ప్రాచీన ఆలయం

అమరాపురం మండలం హేమావతి గ్రామంలో ఉన్న సిద్దేశ్వరస్వామి దేవాలయాన్ని క్రీస్తు శకం 8, 9 శతాబ్దాల్లో నొళంబ రాజులు నిర్మించారు. దొడ్డేశ్వర స్వామి, మల్లీశ్వరస్వామి, విరుపాక్షేశ్వర, చిత్రేశ్వర, సోమేశ్వర అను ఐదు లింగాలను ప్రతిష్ఠించారు. సిద్దయోగి అనే మహాముని ఈ ప్రాంతంలో సంచరిస్తూ ఆలయ ప్రాంగణంలో సమాధి కావడంతో సిద్దేశ్వరస్వామిగా పిలుస్తున్నారు. శివుడు లింగరూపంలో కాకుండా మానవ రూపంలో వెలసిన క్షేత్రం దక్షిణ భారతదేశంలోనే ఇదొక్కటే. ప్రతి నిత్యం సూర్యాస్తమయ సమయంలో సూర్య కిరణాలు సిద్దేశ్వర స్వామి నుదుటిపై పడడం విశేషం. ఏటా శివరాత్రి పర్వదినాన ఉత్సవాలు నిర్వహిస్తారు. జాతర, సిడిమాను, పూల రథం, అగ్నిగుండం, చిన్న రథోత్సవం, బ్రహ్మరథోత్సవం ఉంటాయి. స్వామి దర్శనం కోసం కర్ణాటక ప్రాంతం నుంచి కూడా వేలాది మంది భక్తులు తరలివస్తారు.



తోలుబొమ్మల పుట్టిల్లు

ధర్మవరం మండలం నిమ్మలకుంట గ్రామం తోలుబొమ్మలకు పుట్టినిల్లు. ప్రతి ఇంట్లో తోలుబొమ్మల కళాకారులున్నారు. తోలుబొమ్మల కళాకారుడు దళవాయి చలపతిరావుకు పద్మశ్రీ అవార్డు దక్కింది. దళవాయి శివమ్మ, కుళ్లాయప్పకు శిల్పగురు, పలు జాతీయ, అంతర్జాతీయ అవార్డులు దక్కాయి. ఎంతోమంది ప్రముఖులు గ్రామానికి వచ్చి తోలుబొమ్మలను వీక్షిస్తుంటారు. ఈ ఊరి కళాకారులు అంతర్జాతీయ స్థాయిలో ప్రదర్శనలు, స్టాల్స్‌ను ఏర్పాటు చేస్తుంటారు.

రాయలు ఏలిన నేల

పెనుకొండ చారిత్రాత్మక ప్రదేశం. విజయనగర సామ్రాజ్య చక్రవర్తి కృష్ణదేవరాయలు ఏలిన ప్రాంతం. ఈ ప్రాంతంలో గత వైభవానికి చిహ్నంగా అనేక కట్టడాలు, కోటగోడలు, కొండపై ఖిల్లా, లక్ష్మీనరసింహస్వామి ఆలయం, కొండకింద రాయల వేసవి విడిది గగన్మహల్, మహామంత్రి తిమ్మరుసు సమాధి, 365 దేవాలయాలు ఉన్నాయి. బాబయ్యస్వామి దర్గా, జైన దేవాలయాలు దర్శనమిస్తాయి. కొండపైకి రోడ్డు కూడా నిర్మించారు. పెనుకొండకు అంతర్జాతీయ కియ పరిశ్రమ రావడం, గొల్లపల్లి రిజర్వాయర్ నిర్మించడంతో ఈ ప్రాంత రూపురేఖలు మారిపోయాయి. పర్యాటకుల సంఖ్య విపరీతంగా పెరిగింది.



కొండపై పురాతన లక్ష్మీనరసింహస్వామి ఆలయం ముఖద్వారం

పట్టుచీర అంటేనే.. ధర్మవరం..

చేనేత పట్టుచీరలకు నిలయంగా ధర్మవరం ప్రసిద్ధిచెందింది. దేశంలోనే కాక పలుదేశాల్లోని మగువలు ధర్మవరం పట్టుచీరలను ఇష్టపడతారు. అత్యద్భుతమైన డిజైన్లతో చీరలను నేస్తుంటారు. ఈ చీరల కొనుగోలుకు దేశంలోని ప్రముఖులు వస్తుంటారు. చీరలపై అద్భుత డిజైన్లతో స్వామివార్ల ఫొటోలు, పీఎం, సీఎం చిత్రాలను వేస్తుండేవారు. ప్యూర్ పట్టుచీర ఒక్క ధర్మవరంలోనే దొరుకుతుందని నమ్మకం.

టెక్స్‌టైల్స్ పార్క్ అభివృద్ధికి పెద్దపీట

బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత



గార్మెంట్స్ పరిశ్రమను సందర్శిస్తున్న మంత్రి సవిత, ఎమ్మెల్యే కాలవ

రాయదుర్గంరూరల్, సెప్టెంబరు 26: రాష్ట్రంలో టెక్స్‌టైల్స్ పార్క్ అభివృద్ధికి తెలుగుదేశం పార్టీ పెద్దపీట వేస్తుందని బీసీ సంక్షేమ శాఖ టెక్స్‌టైల్స్ జౌళిశాఖ మంత్రి సవిత అన్నారు. గురువారం మండలంలోని 74 ఉడేగోళం గ్రామం వద్ద ఉన్న టెక్స్‌టైల్స్ పార్క్‌ను ఆమె సందర్శించారు. అనంతరం టెక్స్‌టైల్స్ పార్కులో పారిశ్రామికవేత్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాయదుర్గం ప్రాంతంలో వేలాది మంది గార్మెంట్స్ పరిశ్రమపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారన్నారు. గార్మెంట్స్ పరిశ్రమ ద్వారా ఎక్కువమంది ఉపాధి పొందుతున్నారన్నారు. గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం టెక్స్‌టైల్స్ పార్క్‌ను పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. గార్మెంట్స్ పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్న కార్మికులకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. వారికి రుణాలు అందిస్తామన్నారు. మార్కెటింగ్ సదుపాయం కల్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ టెక్స్‌టైల్స్ పార్క్ అభివృద్ధికి కట్టుబడి ఉందన్నారు. గార్మెంట్స్ పరిశ్రమ అభివృద్ధికి అన్ని రకాలుగా చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో టెక్స్‌టైల్స్ పార్క్ మేనేజర్ శివారెడ్డి, మండల కన్వీనర్లు హనుమంతు, హనుమంతరెడ్డి, రెడీమేడ్ గార్మెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు టంకశాల హనుమంతు, ఉపాధ్యక్షులు మురళి పాల్గొన్నారు.

ఎక్సైజ్ ఏఈఎస్‌ల బదిలీ

అనంతపురం అర్బన్, సెప్టెంబరు 26: ఎక్సైజ్ శాఖలో పనిచేస్తున్న పలువురు అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెంటెంట్‌లు (ఏఈఎస్) బదిలీ అయ్యారు. అనంతపురం ఐఎంఎల్ డిపో అసిస్టెంట్ మేనేజర్‌గా ఏఈఎస్ వేణుగోపాల్‌రెడ్డి నియమితులయ్యారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగానికి శ్రీరామ్, అనంతపురం ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆఫీస్ ఏఈఎస్‌గా రేవతి సుబ్రహ్మణ్యం, పుట్టపర్తి ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆఫీస్ ఏఈఎస్‌గా నరసింహులు నియమితులయ్యారు.

సమగ్రశిక్షలో పోస్టుల భర్తీ షురూ

అనంతపురం విద్య, సెప్టెంబరు 26: సమగ్రశిక్ష ప్రాజక్టులో ఖాళీగా ఉన్న సెక్టోరియల్, అసిస్టెంట్ సెక్టోరియల్ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు అక్టోబరు 1వ తేదీన ఇంటర్వ్యూ నిర్వహించనున్నారు. ఇటీవల ప్రాజక్టులో ఉన్న సెక్టోరియల్, అసిస్టెంట్ సెక్టోరియల్ అధికారులు విద్యాశాఖకు రీప్యాట్రేషన్ అయిన విషయం తెలిసిందే. దీంతో కొత్తగా పోస్టుల భర్తీకి ఆసక్తి ఉన్న ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. అందులో అర్హుల జాబితాల సిద్ధం చేశారు. అయితే ఎంత మందిని ఇంటర్వ్యూకు ఎంపిక చేశారన్న అంశాన్ని అటు విద్యాశాఖ, ఇటు సమగ్రశిక్ష ప్రాజక్టు అధికారులు గోప్యంగా ఉంచుతున్నారు.

రైళ్ల పాక్షిక రద్దు, దారి మళ్లింపు

గుంతకల్లు, సెప్టెంబరు 26: వర్షాల కారణంగా నైరుతి రైల్వేజోన్ పరిధిలోని హుబ్లీ వద్ద ట్రాక్ నీటమునగడంతో కొన్ని రైళ్లను దారిమళ్లించి, పాక్షికంగా రద్దు చేసినట్లు అధికారులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. హుబ్లీ-హైదరాబాద్ రైలు (నెం.17319)ను గురు, శుక్ర, శనివారాల్లో, దీని తిరుగు ప్రయాణపు రైలు (నెం. 17320)ను 27, 28, 29 తేదీల్లో దారి మళ్లించినట్లు తెలిపారు. ఈ రైళ్లను పేర్కొన్న తేదీల్లో వాడి-సూలేహళ్లి మీదుగా కాకుండా, గదగ్, బళ్లారి, గుంతకల్లు బైపాస్, రాయచూరు, వాడి, సూలేహళ్లి స్టేషన్ల మీదుగా మళ్లించనున్నట్లు తెలియజేశారు. అలాగే మైసూరు-బాగల్‌కోట్ బసవ ఎక్స్‌ప్రెస్ (నెం. 17307) రైలును ఈ నెల 27, 28, 29 తేదీల్లో, దీని తిరుగు ప్రయాణపు రైలు (నెం. 17308)ను 26, 27, 28 తేదీల్లో బాగల్‌కోట్-షోలాపూర్ సెక్షన్‌లో పాక్షికంగా రద్దుపరచి, కేవలం షోలాపూర్-మైసూర్ సెక్షన్‌లో నడపనున్నట్లు వివరించారు. ప్రయాణికులు ఈ విషయాన్ని గమనించి ప్రయాణాలకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని తెలియజేశారు.

విద్యా వ్యతిరేక విధానాలపై పోరాటం

అనంతపురం విద్య, సెప్టెంబరు 26: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విద్యావ్యతిరేక విధానాలపై పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందని ఏఐఎస్ఎఫ్ నాయకులు అన్నారు. 49వ రాష్ట్ర మహాసభలు విజయనగరంలో నవంబరు నెలలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. గురువారం ఆ సంఘం కార్యాలయంలో మహాసభల లోగోను ఆవిష్కరించారు. అనంతరం ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు హనుమంతరాయుడు, ప్రధానకార్యదర్శి కుళ్లాయిస్వామి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదలకు వైద్య విద్యను దూరం చేస్తోందన్నారు. గత ప్రభుత్వం ఇచ్చిన జీవోలు 107, 108 వెంటనే రద్దు చేయాలని కోరారు. ప్రభుత్వం వెంటనే పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలను రూ. 2500 పెంచాలని కోరారు. నవంబరు 27 నుంచి 30వ తేదీ వరకు రాష్ట్ర మహాసభలు ఉంటాయన్నారు.

ఆపరేషన్‌కు భయపడి...



రామచంద్రారెడ్డి (ఫైల్)

సూది మందు వేస్తామంటే చిన్నారులు భయపడి పారిపోతుంటారు. కానీ ఓ పెద్దాయన గుండెకు ఆపరేషన్ చేస్తారని భయపడి అదృశ్యమయ్యారు. అనంతపురం రూరల్ మండలం కురుగుంట గ్రామానికి చెందిన రామచంద్రారెడ్డి రంగస్థల కళాకారుడు. ఆయనకు గుండె నొప్పి రావడంతో చికిత్స చేయించారు. వైద్యుల సూచన మేరకు ఈ నెల 23న ఆపరేషన్ చేయించాలని నిర్ణయించారు. ఆపరేషన్ అంటే భయపడిన ఆయన.. ఈ నెల 22న చెప్పాపెట్టకుండా ఇంటి నుంచి వెళ్లిపోయారు. కుటుంబ సభ్యులు ఆయన ఆచూకీ కోసం వెతికినా ఫలితం లేకపోయింది. దీంతో అనంతపురం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఫిర్యాదు చేశారు. 'పెద్దాయనా.. ఆపరేషన్ చేస్తే ఆయువు పెరుగుతుంది. ఇంటిల్లిపాదితో కలిసి నిండు నూరేళ్లు ఆనందంగా గడపవచ్చు. నొప్పి తెలియకుండా మత్తు మందు ఇస్తారు. ఎక్కడున్నా వచ్చెయ్.. మీ కోసం అయినవారు అందరూ ఎదురు చూస్తున్నారు.'

- అనంతపురం క్రైం

కేజీబీవీల్లో పోస్టుల భర్తీకి శ్రీకారం

అనంతపురం విద్య, సెప్టెంబరు 26: కేజీబీవీలో కొలువుల భర్తీకి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. రాష్ట్రవ్యాప్తంగా 5 జిల్లాలు మినహా పలు జిల్లాల్లో భారీగా పోస్టులను భర్తీ చేసేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధమైంది. 2024-25 విద్యా ఏడాదికి టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులను భర్తీ చేయనున్నారు. ప్రిన్సిపాల్, పీజీటీలు, సీఆర్టీలు, పీఈటీలు అకౌంటెంట్, వార్డెన్ పోస్టులను మహిళా అభ్యర్థులతో భర్తీ చేసేందుకు సిద్ధమైంది. కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన పోస్టులను భర్తీ చేయనున్నారు. కొత్త జిల్లాలు యూనిట్‌గా తీసుకుని పోస్టులను భర్తీ చేయనున్నారు. అభ్యర్థులు @apkgbv.apcfss.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

భర్తీకానున్న 68 పోస్టులు

అనంతపురం జిల్లావ్యాప్తంగా కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ 68 పోస్టులను భర్తీ చేయనున్నారు. ఇందులో టీచింగ్ పోస్టులు 57, నాన్ టీచింగ్ పోస్టులు 11 ఉన్నాయి. కాంట్రాక్టు ఉద్యోగాలు కాంట్రాక్టు రెసిడెన్షియల్ టీచర్స్ (సీఆర్టీ) పోస్టులు 20, పోస్టు గ్రాడ్యుయేట్ టీచర్స్ (పీజీటీ) పోస్టులు 21, అవుట్ సోర్సింగ్ పోస్టులు పార్ట్ టైం టీచర్స్ 16 పోస్టులు, వార్డెన్స్ 7 పోస్టులు, అకౌంటెంట్లు 4 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. జిల్లావ్యాప్తంగా 68 పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

అక్టోబరు 10వ తేదీ వరకు దరఖాస్తుల స్వీకరణ

ఈనెల 26వ తేదీ నుంచి వచ్చే నెల 10వతేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తారు. 14వ తేదీ నుంచి 16వ తేదీ మధ్య అభ్యర్థుల జనరల్ మెరిట్ లిస్టును సమగ్రశిక్ష స్టేట్ ప్రాజక్టు డైరెక్టర్ కార్యాలయ అధికారులు రూపొందించి విడుదల చేస్తారు. 17, 18 తేదీల్లో జిల్లాస్థాయి ఎంపిక కమిటీ అధికారుల ఆధ్వర్యంలో సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ఉంటుంది. 19వ తేదీ అభ్యర్థుల ఫైనల్ లిస్టును తయారు చేసి సర్టిఫికెట్లను పరిశీలిస్తారు. 21వ తేదీ ఫైనల్ మెరిట్ లిస్టుపై అభ్యంతరాలను స్వీకరించి పరిష్కరిస్తారు. 22న తుది మెరిట్ లిస్టును ప్రదర్శిస్తారు. 23న ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు నియామకపత్రాలు అందిస్తారు. కొత్త కొలువుకు ఎంపికైన వారు 24వ తేదీ డ్యూటీకి రిపోర్ట్ చేసుకోవాల్సి ఉంటుంది.

కమిటీచే అభ్యర్థుల ఎంపిక

జిల్లా కమిటీ అభ్యర్థులను ఎంపిక చేస్తుంది. కమిటీకి కలెక్టర్ చైర్మన్‌గా, డీఈఓ అండ్ సమగ్రశిక్ష ప్రాజక్టు ఎక్స్ అఫీషియో ప్రాజక్టు కో-ఆర్డినేటర్ మెంబర్‌గా, సమగ్రశిక్ష ప్రాజక్టు అడిషనల్ ప్రాజక్టు కోఆర్డినేటర్(ఏపీసీ) మెంబర్ కన్వీనర్‌గా, జిల్లా కేంద్రంలోని డిప్యూటీ డీఈఓ, గర్ల్ చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్(జీసీడీఓ) లేదా అసిస్టెంట్ జీసీడీఓ సభ్యులుగా ఉంటారు. ఈ కమిటీ ద్వారా ఎంపికైన అభ్యర్థులకు పోస్టును బట్టి జీతం చెల్లిస్తారు. ప్రిన్సిపాల్ పోస్టుకు రూ. 34,139, పీజీటీలు, సీఆర్టీలు, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్స్(పీఈటీ)లకు రూ. 26, 759, అకౌంటెంట్లు, వార్డెన్స్, పార్ట్ టైం ఇన్‌స్ట్రక్టర్స్‌కు రూ. 18, 500 వేతనం ఉంటుంది.

రూ.2.80 కోట్ల నిధులు ఏమైనట్లు...!

రైతుల సొమ్ముపై విచారణ చేయండి
ఏడీసీసీ బ్యాంకు మహాజన సభలో పీఐసీ, జేసీ శివ్‌నారాయణ్ శర్మ



మహాజన సభలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్‌శర్మ

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 26: రైతులకు అందాల్సిన వడ్డీ రూ.2.80 కోట్లు ఏమైనట్లని, వెంటనే విచారణ చేసి నివేదిక ఇవ్వాలని ఏడీసీసీ బ్యాంకు పర్సన్ ఇన్‌చార్జి, జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్‌శర్మ సహకార శాఖ అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక ఎన్టీఆర్ సహకారభవన్‌లో జిల్లా సహకార కేంద్రబ్యాంకు 127వ మహాజన సభ జరిగింది. ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల పర్సన్ ఇన్‌చార్జిలుగా ఉన్న సహకార శాఖ అధికారులు మాట్లాడుతూ రైతులకు అందాల్సిన వడ్డీ సొమ్ము రూ.2.80కోట్లు ఏమైందని ప్రశ్నించారు. ఏడీసీసీ బ్యాంకు లోన్స్ ఇన్‌చార్జి డీజీఎం ఏబీ రాంప్రసాద్ జోక్యం చేసుకుని టెక్నికల్ సమస్యతో కంప్యూటర్‌లో అలా చూపిస్తోందని చెప్పడానికి ప్రయత్నించారు. ఈ విషయమై సహకార శాఖ అధికారులు వాదనకు దిగారు. ఈ సందర్భంలో జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్‌శర్మ కలుగజేసుకుని సొసైటీలకు సంబంధించి కంప్యూటరైజేషన్ అక్టోబరు 2వతేదీలోపు పూర్తి చేయాలన్నారు. గాంధీ జయంతి సందర్భంగా దేశమంతగా సొసైటీల ఆన్‌లైన్ సేవలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రారంభిస్తాయని తెలిపారు. నష్టాల్లో ఉన్న సొసైటీలను లాభాల్లోకి తీసుకురావడానికి పెట్రోలు బంకులు, ఫర్టిలైజర్స్ విక్రయం, గోడౌన్‌ల నిర్మాణం చేపడుతున్నామన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల అమలులో కీలకపాత్ర పోషించాలన్నారు. రైతులకు అందాల్సిన రూ.2.80కోట్లు నిధులు ఏమయ్యాయి..? దేనికి మళ్లించారు..? తదితర విషయాలపై సమగ్రవిచారణ జరిపి నివేదిక ఇవ్వాలని సహకార శాఖ అధికారులను ఆదేశించారు. సొసైటీలను సక్రమమార్గంలో నడిపించే రైతుల సేవలను మరింత విస్తృతం చేయాలని సూచించారు. జిల్లా సహకార శాఖ అధికారి (డీసీఓ) అరుణకుమారి మాట్లాడుతూ రికార్డుల్లో ఉండే లెక్కలకు, కంప్యూటరైజేషన్‌లో చేర్చిన లెక్కలకు ఉన్న వ్యత్యాసాలను సరిచేయాలన్నారు. ఉమ్మడి జిల్లాలో 52 గోడౌన్లు మంజూరు కాగా కేవలం 7 మాత్రమే తమకు అప్పగించారని, మిగిలిన 45 త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. సభలో ఏడీసీసీ బ్యాంకు సీఈఓ సురేఖ రాణి, డీఎల్‌సీఓ ప్రభాకర్‌రెడ్డి, బ్యాంకు అధికారులు, పాలకవర్గసభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆటోను ఢీకొన్న జడ్పీ వైస్‌చైర్మన్ వాహనం

ముగ్గురు యువకులకు తీవ్రగాయాలు
కామిరెడ్డిపల్లి సుధాకర్‌రెడ్డితోపాటు డ్రైవర్‌పై కేసు నమోదు



ప్రమాదంలో నుజ్జునుజ్జైన ఆటో

ధర్మవరంరూరల్, సెప్టెంబరు 26: మండలంలోని పోతుకుంట వద్ద జడ్పీ వైస్ చైర్మన్ కామిరెడ్డిపల్లి సుధాకర్‌రెడ్డికి చెందిన స్కార్పియో వాహనం ఆటోను వేగంగా ఢీకొనడంతో ఆటోలో ప్రయాణిస్తున్న ముగ్గురు యువకులకు తీవ్రగాయాలయ్యాయి. సుధాకర్‌రెడ్డి గురువారం తన స్వగ్రామమైన కామిరెడ్డిపల్లి నుంచి వాహనంలో గురువారం ధర్మవరం వస్తున్నాడు. వాహనం పోతుకుంట వద్ద కుణుతూరుకు వెళ్తున్న ఆటోను వేగంగా ఢీకొంది. ఆటో డ్రైవర్ యశ్వంత్‌కుమార్‌రెడ్డి, అందులో ప్రయాణిస్తున్న జనార్దన్, అఖిలానందరెడ్డిలకు తీవ్రగాయాలయ్యాయి. దీంతో వారికి ధర్మవరం ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి పంపారు. ప్రమాదంలో ఆటో నుజ్జునుజ్జయింది. సుధాకర్‌రెడ్డి వాహనం ముందుభాగంలో దెబ్బతింది. స్కార్పియో వేగంగా రావడంతోనే ప్రమాదం జరిగిందని బాధితులు ఫిర్యాదు చేశారు. రూరల్ పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కామిరెడ్డిపల్లి సుధాకర్‌రెడ్డితోపాటు డ్రైవర్ శ్రీకాంత్‌రెడ్డిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. కాగా నాలుగురోజుల క్రితం ధర్మవరంలో సబ్‌జైలు వద్ద వైసీపీ, బీజేపీ వర్గీయుల మధ్య జరిగిన ఘర్షణకు సంబంధించి సుధాకర్‌రెడ్డిపై హత్యాయత్నం కేసు నమోదయ్యింది.



గాయపడిన జనార్దన్, అఖిలానందరెడ్డి, యశ్వంత్‌కుమార్‌రెడ్డి

ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్‌గా నాగమద్దయ్య బాధ్యతల స్వీకరణ



ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య

అనంతపురం అర్బన్, సెప్టెంబరు 26 : ఉమ్మడి అనంత జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్‌గా నాగమద్దయ్య గురువారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో రాయలసీమ జిల్లాల పరిధిలో కర్నూలు కేంద్రంగా డిప్యూటీ కమిషనర్‌గా విధులు నిర్వర్తించేవారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో ఉమ్మడి అనంత జిల్లా పరిధిలో డిప్యూటీ కమిషనర్‌గా నియమించారు. ఆయన నగరంలోని కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు.

ఎక్సైజ్ సూపరింటెండెంట్‌గా రామ్మోహన్‌రెడ్డి...



ఎక్సైజ్ సూపరింటెండెంట్ రామ్మోహన్‌రెడ్డి

అనంతపురం అర్బన్: జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్‌గా రామ్మోహన్‌రెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న మధుసూదన్‌రావును అన్నమయ్య జిల్లాకు బదిలీ చేయగా ఆయన రిలీవ్ అయ్యారు. బాధ్యతలు స్వీకరించిన రామ్మోహన్‌రెడ్డికి పలువురు ఎక్సైజ్ సీఐలు, ఎస్‌ఐలు, కానిస్టేబుళ్లు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్‌గా మునిస్వామి...

అనంతపురం అర్బన్, సెప్టెంబరు 26 : స్థానిక ఎక్సైజ్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్‌గా మునిస్వామి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ అసిస్టెంట్ కమిషనర్‌గా పనిచేస్తున్న బాలకృష్ణను తిరుపతి డిస్టిలరీకి బదిలీ చేశారు. ఈ నేపథ్యంలో విజయవాడ డిస్టిలరీలో పనిచేస్తున్న అసిస్టెంట్ కమిషనర్ మునిస్వామిని జిల్లాకు బదిలీ చేశారు.

డిప్యూటీ తహసీల్దార్ల నియామకం

అనంతపురం రూరల్, సెప్టెంబరు 26: అర్బన్, రూరల్ డిప్యూటి తహసీల్దార్లను నియమిస్తూ జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. అర్బన్ డిప్యూటీ తహసీల్దార్‌గా డి రాజ, అనంతపురం రూరల్ డిప్యూటీ తహసీల్దార్‌గా ప్రకాష్‌రావు నియమితుల య్యారు. అనంతపురం రూరల్ సీనియర్ అసిస్టెంట్‌గా యోగేంద్ర ప్రసాద్‌ను నియమించారు.

టమోటా కిలో రూ.46

అనంతపురం రూరల్: కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.46తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్ కు గురువారం 1,650 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయ న్నారు. కిలో సరాసరి ధర రూ.37, కనిష్ఠ ధర రూ.27పలికినట్లు ఆయన తెలిపారు.

వరద బాధితులకు తలపనేని విరాళం



సీఎం చంద్రబాబుకు చెక్కును అందజేస్తున్న పాండు తలపనేని

చెన్నేకొత్తపల్లి, సెప్టెంబరు 26: విజయవాడ వరద బాధితుల సహాయార్థం చెన్నేకొత్తపల్లి మండల పెద్ద మొగలాయపల్లికి చెందిన తెలుగు ప్రొఫెషనల్ వింగ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాండు తలపనేని తనవంతుగా ఆర్థిక సాయం అందించారు. ఆయన గురువారం మంగళగిరిలోని టీడీపీ కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును కలిసి రూ.2.50లక్షల చెక్కును సీఎం సహాయ నిధికి విరాళంగా అందజేశారు. స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన పాండును సీఎం చంద్రబాబు అభినందించారు.

'దూర విద్య'కు దరఖాస్తు చేసుకోండి

గార్లదిన్నె, సెప్టెంబరు 26: సార్వత్రిక విద్యాపీఠం (దూర విద్యా విధానం) ద్వారా 2024-25 సంవత్సరానికి సంబంధించి పదో తరగతి, ఇంటర్ కోర్సుల్లో ప్రవేశానికి ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకోవాలని మండల విద్యాశాఖ అధికారి తారా చంద్రానాయక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 14 ఏళ్లు నిండిన వారు పదో తరగతి, 15 ఏళ్లు పూర్తి అయిన వారు ఇంటర్ చేరేందుకు అర్హులన్నారు. ఆసక్తి ఉన్న వారు ఈనెల 30లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు మండల విద్యాశాఖ, జిల్లా విద్యాశాఖ కార్యాలయాల్లోగానీ, సెల్‌ఫోన్ నం. 8328692025ను గానీ సంప్రదించాలన్నారు.

గ్రంథాలయంలో సభ్యత్వ నమోదు పెంచాలి

గార్లదిన్నె, సెపెటంబరు 26: గ్రంథాలయంలో సభ్యత్వ నమోదు పెంచాలని ఆ సంస్థ కార్యదర్శి రమ పేర్కొన్నారు. స్థానిక గ్రంథాలయాన్ని ఆమె గురువారం సందర్శించారు. గ్రంథాలయంలో రికార్డులను పరిశీలించారు. సభ్యత్వ నమోదు పెంచి పాఠకులు అధికంగా వచ్చేల కృషి చేయాలని గ్రంథాలయాధికారి శిరీషకు సూచించారు. అనంతరం గ్రంథాలయానికి వచ్చిన పాఠకులతో మాట్లాడారు.

జిల్లా ఆస్పత్రికి కొత్త 'మహాప్రస్థానం'

అనంతపురం టౌన్, సెప్టెంబరు26 : జిల్లా సర్వజన ఆస్పత్రికి కొత్త మహాప్రస్థాన వాహనం వచ్చింది. ఇక్కడ ఉన్న వాహనం పాతది కావడంతో మృతదేహాలు తరలించడానికి ఇబ్బందిగా మారింది. ఈనేపథ్యంలో ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ తన ఎంపీ నిధులు రూ. 8. 18 లక్షలు మంజూరు చేశారు. ఆనిధులతో షోరూమ్‌లో వాహనం కొనుగోలుచేశామని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు గురువారం తెలిపారు. అక్టోబరు ఒకటో తేదీనుంచి ఈవాహనం ద్వారా సేవలు ప్రారంభిస్తామన్నారు. ఇందుకు సహకరించిన ఎంపీకి సూపరింటెండెంట్ కృతజ్ఞతలు తెలిపారు.

మహిళ ఆత్మహత్య

కనగానపల్లి, సెప్టెంబరు26: మండలకేంద్రంలోని కనగానపల్లికి చెందిన సాకే ఇందిరమ్మ(34) అనే మహిళ బుధవారం అర్ధరాత్రి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. సాకే ఇందిరమ్మకు 16 సంవత్సరాల క్రితం కూడేరుకు చెందిన రాముడుతో వివాహమైంది. భర్తతో గొడవపడి కొన్నేళ్లుగా పుట్టినిల్లైన కనగానపల్లిలో తన ముగ్గురు పిల్లలతో ఉంటోంది. అయితే ఈ మధ్యనే ఇందిరమ్మ తండ్రి క్రిష్టప్ప రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందాడు. దీంతో ఆమెకు కుటుంబపోషణ కోసం అప్పులు చేసింది. అప్పులు అధికం కావడం, కుటుంబపోషణ భారమై ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. గురువారం ఉదయం కుటుంబసభ్యులు లేచిచూసేసరికి అప్పటికే ఆమె ఉరికి వేలాడుతూ కనిపించింది. దీంతో వారు బోరున విలపించారు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో పోలీసులు అక్కడికి వెళ్లి కేసు నమోదు చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఇందిరమ్మ తల్లి ఫిర్యాదుమేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురికి గాయాలు

అనంతపురం క్రైం, సెప్టెంబరు 26: నగర శివార్లలో జరిగిన రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురికి గాయాలయ్యాయి. నగరానికి చెందిన మౌనిక, కుళ్లాయప్ప అనే వ్యక్తితో కలిసి బైక్‌లో గురువారం రాత్రి వెళ్తుండగా రాచానపల్లి సమీపంలో ఐచర్ ఢీ కొంది. దీంతో మౌనికకు తీవ్ర, కుళ్లాయప్పకు స్వల్ప గాయాలయ్యాయి. వారిని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. గురువారం రాత్రి భాగ్యనగర్‌కు చెందిన హమీదా, భవానీనగర్‌కు చెందిన మహబూబ్‌బీ నడిచి వెళ్తుండగా... తపోవనం సర్కిల్‌లో పెద్దవడుగూరుకు చెందిన దస్తగిరి అనే వ్యక్తి వెళ్తున్న ఓవర్‌టేక్ చేసే సమయంలో బైక్‌తో ఢీకొట్టాడు. దీంతో ఆ ఇద్దరు మహిళలను చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వారిలో వహీదా తలలో రక్తం గడ్డకట్టినట్లు వైద్యవర్గాలు తెలిపాయి.

ప్రజలకు నష్టం కలిగిస్తే సహించం

ఎంపీ అంబికా, ఎమ్మెల్యే దగ్గుపాటి



కార్యక్రమంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు

అనంతపురంరూరల్, సెప్టెంబరు 26: ప్రజలకు నష్టం కలిగిస్తే సహించేది లేదని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పేర్కొన్నారు. మండలంలోని ఎ నారాయణపురం పంచాయితీ స్టాలిన్ నగర్‌లో గురువారం ఇది మంచి ప్రభుత్వ కార్యక్రమాన్ని నిర్వహించారు. కలెక్టర్ వినోద్‌కుమార్, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులతో కలసి ఇంటింటికి తిరుగుతూ వందరోజుల్లో ప్రభుత్వం చేపట్టిన పథకాలు, అభివృద్ధి పనుల గురించి ప్రజలకు వివరించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన సామూహిక సీమంతాల కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఎంపీ మాట్లాడుతూ..వైసీపీ ఐదేళ్ల పాలనలో ఎంత నాశనం చేయాలో అంతా చేశారన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ... ప్రజలకు జరుగుతున్న మంచిని చూసి వైసీపీ నేతలు జీర్ణించుకోలేక కుట్రలకు తెర లేపుతున్నారన్నారు. తిరుమల లడ్డూని కలుషితం చేసి, ఇప్పుడు ఆలయాల్లో పూజలు చేయలంటూ జగన్ పిలుపు నివ్వడం శోచనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ వసంతకుమార్, తహసీల్దార్ హరికుమార్, ఎంపీడీఓ పుల్లయ్య, పంచాయతీ కార్యదర్శి అశోక్‌బాబు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు ఆదినారాయణ, ఆదెన్న, రాయల్ మురళి, అర్బన్ బ్యాంకు చైర్మన్ జేఎల్ మురళి, కురుబ నారాయణస్వామి, బీజేపీ రాష్ట్రకార్యదర్శి లలిత్ కుమార్, టీడీపీ నాయకులు డిష్‌నాగరాజు, ఓబులపతి, నాగరాజు, కూచి హరి, విశాలాక్షి, గౌస్‌మొహిద్దీన్, ఫిరోజ్ అహ్మద్, సైఫుద్దీన్, తాజుద్దీన్ స్వప్న, తేజస్విని, సరిపూటి రమణ, పల్లవి, రాజారావు తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తాం

● ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ



జనచైతన్యకాలనీలో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శ్రావణిశ్రీ

బుక్కరాయసముద్రం: గత ఐదేళ్ల వైసీపీ పాలనలో వెనుకబడిన నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ అన్నారు. మండల కేంద్రంలోని జనచైతన్యకాలనీలో గురువారం ఇది మంచి ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. తొలుత జనచైతన్య కాలనీలో సీసీ రోడ్లు నిర్మాణానికి భూమి పూజ చేసి శిలాఫలకం ఆవిష్కరించారు. కాలనీలో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేసిన, భవిష్యత్తులో చేపట్టే సంక్షేమ పథకాలను వివరించారు. అనంతర సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో ప్రాధాన్యతక్రమంలో రోడ్లు నిర్మాణం చేపడు తున్నట్లు తెలిపారు. కూటమి పాలన ప్రజా రంజకంగా సాగుతోందన్నారు. మాట ఇచ్చిన విధంగా నియోజకవర్గంలో సాగునీరు ఇచ్చామన్నారు. త్వరలోనే తాగునీటి శాశ్వత సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పసుపుల హనుమంతరెడ్డి, నాయకులు పొడరాళ్ల రవీంద్ర, మల్లికార్జునరెడ్డి, సోమశేఖర్, ఓబులపతి, వలి తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీలకు నీవేం చేశావ్..?

మేయర్ వసీంను ప్రశ్నించిన టీడీపీ మైనార్టీ నాయకులు

అనంతపురం అర్బన్, సెప్టెంబరు 26 : నగరంలోని మైనార్టీలంతా కలిసి నిన్ను మేయర్‌ను చేస్తే, నువ్వేం చేశావని టీడీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి ఫిరోజ్ అహ్మద్ ప్రశ్నించారు. ఆయన గురువారం నగరంలోని టీడీపీ అర్బన్ కార్యాలయంలో మాజీ ఎంపీపీ ఇస్మాయిల్‌తో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడారు. ఒక్కటిన్నర సంవత్సరం ఆగితే నిన్ను పలుకరించే వారు ఉండరన్నారు. ఇప్పటికే మేయర్‌గా మూడేళ్లు గడిచినా కనీసం ఒక్క మసీదుకైనా రూ.5వేలు ఇచ్చావా అని నిలదీశారు. ఎంత సేపు నీవు అంకుల్‌గా పిలుచుకునే మాజీ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి చెప్పినట్లు వినడమే సరిపోయిందన్నారు. మైనార్టీలు ఉంటున్న ప్రాంతాలను పట్టించుకోకపోవడంతో ఆయా ప్రాంతాలు దుర్భరంగా మారాయన్నారు. మరో సారి ఎమ్మెల్యే దగ్గుపాటిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు.

డమ్మీ మేయర్.. నోరు అదుపులో పెట్టుకో...!

● తెలుగు మహిళల మండిపాటు

అనంతపురం అర్బన్, సెప్టెంబరు 26: డమ్మీ మేయర్ వసీం... నోరు అదుపులో పెట్టుకో... అని తెలుగు మహిళలు హెచ్చరించారు. నగరంలోని టీడీపీ అర్బన్ కార్యాలయంలో గురువారం తెలుగు మహిళలు బల్లా పల్లవి, రహమత్ బీ, స్వప్న, సంగా తేజస్విని మీడియాతో మాట్లాడుతూ.. మాజీ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ఇంటికి ప్రతి రోజు వెళ్లి అటెండెన్స్ వేయడం మానుకొని, కాలనీల్లో తిరిగితే సమస్యలు తెలుస్తాయన్నారు. పనిముట్ల కొనుగోళ్ల విషయంలో మీ డిప్యూటీ మేయర్లే ప్రశ్నించారని, దీనికి ఏం సమాధానం చెబుతావన్నారు. మూడేళ్లపాటు మేయర్ కుర్చీలో కూర్చొని ఏం ఒరగబెట్టారని దుయ్యబట్టారు. ప్రజలకు సరైన పాలన అందించలేని నీకు ఎమ్మెల్యే దగ్గుపాటిపై మాట్లాడే నైతిక అర్హత లేదన్నారు. త్వరలోనే మీ మాజీ ఎమ్మెల్యే నీ అవినీతి బాగోతాలు బయట పడతాయని హెచ్చరించారు. కార్యక్రమంలో తెలుగు మహిళలు లక్ష్మీనాయుడమ్మ, వడ్డే భవాని, సుమలత తదితరులు పాల్గొన్నారు.

డిక్లరేషన్ ఇవ్వనిదే జగన్‌ను తిరుమలకు అనుమతించొద్దు

● ఏపీ ప్రజాసమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు రమేష్ నాయుడు

అనంతపురం కల్చరల్, సెప్టెంబరు 26: డిక్లరేషన్ ఇవ్వకపోతే మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిని తిరుమలకు అనుమతించకూడదు అని ఏపీ ప్రజాసమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ నల్లాని రమేష్ నాయుడు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అన్యమతస్థులు శ్రీవారి దర్శనానికి వెళ్లే ముందు వైకుంఠం క్యూకాంప్లెక్స్ వద్ద డిక్లరేషన్ ఇవ్వాలన్నది టీటీడీ సాధారణ నిబంధనలు రూల్ 136 ప్రకారం తప్పనిసరి అన్నారు. అన్యమతస్థుడైన జగన్మోహన్‌రెడ్డి తిరుపతి నుంచి అలిపిరి మెట్లు ఎక్కడం ప్రారంభించడానికి ముందు గరుడ సర్కిల్ వద్ద డిక్లరేషన్ ఇవ్వాలన్నారు. తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం కల్తీ జరిగిందని, దానికి ప్రధాన కారకులు గత పాలకులేనని ఆరోపణలు ఎదుర్కొంటున్న నేపథ్యంలో నిజానిజాలు తేల్చేవరకూ జగన్మోహన్‌రెడ్డి తిరుమల వెళ్లకపోవడమే మంచిదని హితవు పలికారు. లడ్డూ తయారీలో కల్తీ ఘటనపై పూర్తిస్థాయి విచారణ జరిపించి, దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

చేనేతల సమస్యల పరిష్కారానికి కృషి చేయండి

● ఎంపీకి పోతుల లక్ష్మీనరసింహులు వినతి

అనంతపురం అర్బన్, సెప్టెంబరు 26: చేనేతల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని అనంతపురం ఎంపీ, కేంద్ర సిల్క్ బోర్డు సభ్యులు అంబికా లక్ష్మీనారాయణను పద్మశాలి కార్పొరేషన్ రాష్ట్ర కమిటీ సభ్యుడు పోతుల లక్ష్మీనరసింహులు కోరారు. అనంతపురం నగర శివారులోని ఎంపీ నివాసంలో పోతుల లక్ష్మీనరసింహులు గురువారం ఆయనను కలిసి శాలువ కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. అనంతరం చేనేతల పలు రకాల సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు.

సహకార సంఘాల ఎన్నికలు నిర్వహించండి

● గొర్రెల పెంపకందారుల యూనియన్ పర్సన్ ఇన్‌చార్జి

అనంతపురం అర్బన్, సెప్టెంబరు 26: జిల్లాలోని గొర్రెల పెంపకందారుల ప్రాథమిక సహకార సంఘాల ఎన్నికలు నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని గొర్రెల పెంపకందారుల సహకార యూనియన్ పర్సన్ ఇన్‌చార్జి, డీడీ రమేష్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక పశుసంవర్ధక శాఖ జేడీ కార్యాలయ ఆవరణంలోని ఐఎస్‌డీపీ భవనంలో గురువారం గొర్రెల పెంపకం దారుల సహకార యూనియన్ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ప్రాథమిక గొర్రెల పెంపకందారుల సహకార సంఘాల ఎన్నికలు నిబంధనల మేరకు జరిగేలా చూడాలన్నారు. ఎన్‌సీడీసీ బకాయిలు అందరూ చెల్లించేలా ప్రత్యేక చొరవ చూపాలన్నారు.

ఆకుతోటపల్లిలో 'ఇది మంచి ప్రభుత్వం'

అనంతపురం రూరల్, సెప్టెంబరు 26: మండలంలోని ఆకుతోటపల్లిలో గురువారం మాజీ ఎంపీటీసీ రమణ ఆధ్వర్యంలో 'ఇది మంచి ప్రభుత్వం' నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ వందరోజుల్లో ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథఖాలను ప్రజలకు వివరించారు. టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు మండల వెంకటరాముడు, పూల నారాయణస్వామి, జయరాం, మురళి, లక్ష్మీనారాయణ, శ్రీనివాసులు, ఆనంద్, పంచాయితీ కార్యదర్శులు మహమ్మద్ రఫీ, దుర్గాప్రసాద్, పావని తదితరులు పాల్గొన్నారు.

రాప్తాడు: మండలంలోని బోగినేపల్లిలో గురువారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ ఉజ్జినప్ప, గ్రామ సచివాలయ సిబ్బందితో కలిసి ఇంటింటికీ వెళ్లి, కూటమి వంద రోజుల పాలన గురించి ప్రజలకు వివరించారు.

వేతనాలు చెల్లించి ఆదుకోవాలి

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 26: నష్టాల్లో ఉన్న సొసైటీలకు చేయూతనివ్వాలని, గత ఏడాదిన్నరగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించి ఆదుకోవాలని ఏపీ రాష్ట్ర ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల (పీఏసీఎస్) ఉద్యోగుల సంఘం నాయకులు కోరారు. జిల్లా కేంద్రంలోని ఏడీసీసీ బ్యాంకు ప్రధాన కార్యాలయంలో గురువారం ఏడీసీసీ బ్యాంకు పర్సన్ ఇన్‌చార్జి, జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్‌శర్మను కలిసి వినతిపత్రం అందజేశా రు. ఈ సందర్భంగా సొసైటీల ఉద్యోగుల సంఘం నాయకులు మాట్లాడుతూ...సొసైటీలకు ఆదాయంలో రావాల్సిన నిధులు, రైతులకు దక్కాల్సిన వడ్డీ రాయితీ రూ.2.80కోట్లు నిధులు వెంటనే తమకు చెల్లించాలని కోరారు. గత ఐదేళ్లుగా సొసైటీలకు కేంద్రప్రభుత్వం చెల్లించే వడ్డీ రైతులకు ఇవ్వకుండా ఏడీసీసీ బ్యాంకులోనే తొక్కిపెట్టారని, విషయం బయటకు రాకుండా అధికారులు యత్నిస్తున్నారని ఫిర్యాదు చేశారు. సొసైటీలలో నిధులు లేక, ఉద్యోగులకు వేతనాలు చెల్లించక మూతపడే దయనీయ స్థితిలో ఉన్నాయని తెలిపారు. 2018లో అప్పటి టీడీపీ ప్రభుత్వం జారీ చేసిన సొసైటీ ఉద్యోగుల హెచ్‌ఆర్ పాలసీని నేటికి అమలు చేయడం లేదన్నారు. వెంటనే సొసైటీల సమస్యలు పరిష్కరించాలని కోరారు. దీనికి జేసీ స్పందిస్తూ పరిశీలించి పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు. సొసైటీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆంజనేయులు, హరికృష్ణ, కన్వీనర్ ప్రతాప్‌రెడ్డి, దామోదర్, శ్రీనివాసులు, రమణారెడ్డి, హనుమంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

● ఎంపీ అంబికా ● మసీదు నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపన అనంతరం ప్రార్థనలు చేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే తదితరులు

అనంతపురం కల్చరల్, సెప్టెంబరు 26: మైనార్టీల సంక్షేమమే టీడీపీ కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. స్థానిక డ్రైవర్స్ కాలనీలోని ముస్లిం శ్మశాన వాటికలో గురువారం రాష్ట్ర ముతవల్లిల సంక్షేమ సంఘం అధ్యక్షుడు కేయం షకీల్ షఫి ఆధ్వర్యంలో నూతనంగా నిర్మిస్తున్న అబ్దుల్ రహీం ఖాద్రి మసీదు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్, పెనుకొండ బాబా దర్గా పీఠాధిపతి తాజ్‌బాబా, కర్నూలు దర్గా పీఠాధిపతి ఆరిఫ్ పాషా ఖాదిరి ముఖ్య అతిథులుగా హాజరై శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ మాట్లాడుతూ... డ్రైవర్స్ కాలనీలోని ముస్లిం శ్మశాన వాటిక సుందరీకరణ, నూతన ప్రహరీ నిర్మాణానికి రూ.1.10కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. ఎంపీ అంబికా మాట్లాడుతూ... ముస్లిం మైనార్టీల సంక్షేమమే లక్ష్యంగా సీఎం చంద్రబాబు పాలన అందిస్తున్నారని, రానున్న రోజుల్లో ముస్లిం సమాజాభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. షకీల్ షఫి మాట్లాడుతూ... మన దేశం మత సామరస్యానికి ప్రతీకగా, స్ఫూర్తిదాయకంగా నిలుస్తోందన్నారు. అనంతరం ప్రపంచశాంతికోసం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో ముస్లీం మైనార్టీ నాయకులు ఉర్దూ అకాడమీ మాజీ డైరెక్టర్ ఇక్బాల్, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గౌస్ మొద్దీన్, తాజుద్దీన్, షౌకత్, సైఫుద్దీన్, ప్రభుత్వ ఖాజీలు, ఆల్‌మేవా నాయకులు షేక్షావలి, ఫక్రుద్దీన్, సలీం, జిలాన్, ముస్లీం మైనార్టీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

స్వచ్ఛతాహీ సేవపై పోటీలకు స్పందన

● 30న విజేతలకు బహుమతుల ప్రదానం



వ్యాసరచన పోటీలకు హాజరైన విద్యార్థులు

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 26 : స్వచ్ఛతాహి సేవపై ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఆధ్వర్యంలో గురువారం స్థానిక శారదానగర్‌లోని జేఎన్‌టీయూ రోడ్డులో ఉన్న సైన్సుసెంటర్‌లో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఇతర యాజమాన్య పాఠశాలల్లో చదువుతున్న సుమారు 200మంది విద్యార్థు లు హాజరయ్యారు. గ్రామీణ ప్రాంతాల్లో స్వచ్ఛతాహి సేవ అమలు-సవాళ్లపై 45 నిముషాల పాలు నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో కురుగుంట అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థిని కుముద మొదటి బహుమతి, రాయదుర్గం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని యూన్సీ ద్వితీయ, బుక్కరాయసముద్రం కేజీబీవీ విద్యార్థిని యేసుకుమారి తృతీయ బహుమతి పొందారు. వ్యర్థ రహిత ఇండియా స్థాపనలో యువత పాత్ర అనే అంశంపై వక్తృత్వపోటీల్లో మొదటి బహుమతి పెద్దవడుగూరు కేజీబీవీ విద్యార్థిని జయశ్రీ మొదటి బహుమతి, అనంతపురం విశ్వభారతి స్కూల్ అఖిల్ కార్తికేయ ద్వితీయ, కణేకల్ గురుకుల పాఠశాల వినోద్‌కుమార్ నాయక్ తృతీయ బహుమతి సాధించారు. స్వచ్ఛతాహి సేవలో కమ్యూనిటీ భాగస్వామ్యంపై పోస్టర్ల తయారీలో నార్పల మహాత్మజ్యోతి రావు పూలే గురుకుల పాఠశాల విద్యార్థిని భవ్యశ్రీ మొదటి, రాయదుర్గం జడ్పీ ఉన్నత పాఠశాల నవ్యశ్రీ ద్వితీయ, కొర్రపాడు గురుకుల పాఠశాల విద్యార్థిని మోక్షిత తృతీయ బహుమతికి పొందారు. స్వచ్ఛతాహి సేవ విజయవంతానికి ప్రజల్లో అవగాహన కల్పించే అంశంపై లఘుచిత్రాన్ని నిర్మించే పోటీల్లో ప్రథమ బహుమతి బొమ్మనహాల్ జడ్పీ ఉన్నత పాఠశాలకు ప్రథమ, మోపిడి జడ్పీ ఉన్నత పాఠశాల ద్వితీయ, పాలవెంకటాపురం జడ్పీ ఉన్నతపాఠశాల, గుత్తి కేజీబీవీ తృతీయ స్థానాల్లో నిలిచాయి. విజేతలకు ఈనెల 30వతేదీన సైన్సు సెంటర్‌లో నిర్వహించే స్వచ్ఛతాహి సేవా కార్యక్రమంలో బహుమతు లు ప్రదానం చేస్తామని ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు శాఖ ఈఈ మునిప్రసాద్ తెలిపారు.

చేసిందే.. చెబుతున్నాం

● ఎమ్మెల్యే పరిటాల సునీత



ఇంటింటా కరపత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే సునీత, టీడీపీ నాయకులు

రామగిరి, సెప్టెంబరు 26: తాము వంద రోజుల పాలనలో ఏం చేశామో అదే చెబుతున్నామని, అందుకే ధైర్యంగా ప్రజల వద్దకు వెళ్తున్నామని ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. అంతే ధైర్యంతో వైసీపీ నాయకులు ప్రజల్లోకి వెళ్లగలరా...? అని ప్రశ్నించారు. మండల కేంద్రంలోని రామగిరిలో గురువారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా టీడీపీ నాయకులతో కలిసి ఆమె పర్యటించారు. వందరోజుల్లో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నియోజవర్గంలో అభివృద్ధి అనేది ఐదేళ్ల క్రితం చూశారని, ఆ తరువాత తమ వంద రోజుల పాలనలో చూస్తున్నారన్నారు. గత ఐదేళ్లలో చిన్న రోడ్డు వేయాలంటే స్పందించే వారు లేరని, అదే తమ ప్రభుత్వం వచ్చాక సీసీ రోడ్లకే రూ.25కోట్ల నిధులు విడుదల చేశారన్నారు. టీడీపీ సానుభూతి పరులని చాలా మందికి అర్హత ఉన్నా సంక్షేమ పథకాలు అందకుండా చేశారని, ఈ ప్రభుత్వంలో అర్హతఉంటే అన్ని పథకాలు అందుతాయన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తన అనుభవంతో సమర్థవంతంగా రాష్ట్రాన్ని నడుపుతుంటే వైసీపీ నాయకులు అడ్డుతగులుతూ అనేక కుట్రలకు పాల్పడుతున్నారని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆమె వెంట స్థానిక టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలి

రామగిరి, సెప్టెంబరు 26: విద్యార్థులు చదువుతోపాటు క్రీడలు చాలా అవసరమని ఎమ్మెల్యే పరిటాలసునీత పేర్కొన్నారు. రామగిరిలో గురువారం పరిటాలరవీంద్ర మెమోరియల్ క్రీడామైదానంలో జరుగుతున్న 68వ స్కూల్ గేమ్స్ నియోజకవర్గ స్థాయి అండర్ -14,17 క్రీడా పోటీలు నిర్వహిస్తున్నారు. ఎమ్మెల్యే పాల్గొని క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. క్రీడాకారుల కోసం పరిటాల ర వీంద్ర పేరుమీద క్రీడామైదానం నిర్మిస్తే వైసీపీ హయాంలో సరైన పర్యవేక్షణ లేక అధ్వానంగా మార్చారన్నారు. ఈ ప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యం ఇస్తుందని, ఇక్కడ ఏ అవసమున్న తన దృష్టికి తీసుకురావాల న్నారు.

వేతన బకాయిలు చెల్లించండి

● సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు

అనంతపురం కల్చరల్, సెప్టెంబరు 26: నీలకంఠాపురం శ్రీరాంరెడ్డి తాగునీటి పథకం కార్మికుల బకాయి వేతనాలు చెల్లించేందుకు చర్యలు చేపట్టాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు డిమాండ్ చేశారు. ఆయన గురువారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్‌ను కలిసి తాగునీటి పథకం కార్మికుల సమస్యలను వివరించారు. ఈ సంద ర్భంగా ఓబులు మాట్లాడుతూ... 13 రోజులుగా సమ్మెలో ఉన్న కార్మికులు ఈనెల 17వ తేదీన కలెక్టర్ హామీ ఇవ్వడంతో విధుల్లోకి చేరారన్నారు. అయినా ఇంతవరకూ కార్మికులకు ఎలాంటి బకాయి వేతనాలు కానీ, పీఎఫ్ కానీ చెల్లించలేదని తెలిపారు. కలెక్టర్ మరోసారి జోక్యం చేసుకోవాల ని కోరారు. కార్యక్రమంలో శ్రీరాంరెడ్డి వాటర్ సప్లయ్ కార్మికుల యూని యన్ జిల్లా అధ్యక్షుడు ఎర్రిస్వామి, ఉపాధ్యక్షుడు నరేష్ పాల్గొన్నారు.

బీసీ కులగణన చేపట్టాల్సిందే: సాకే నరేష్

అనంతపురం ప్రెస్‌క్లబ్, సెప్టెంబరు 26 : దేశవ్యాప్తంగా బీసీల లెక్కలు తేల్చాలని, లేకుంటే ప్రభుత్వాల పతనం తప్పదని బీసీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు సాకే నరేష్ హెచ్చరించారు. నగరంలోని సమితి కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దేశ జనాభాలో జనాభాలో 56 శాతం ఉన్న బీసీలకు 27 శాతం రిజర్వేషన్లు అమలు చేయడం శోచనీయమన్నారు. బీసీలు కులగణన విషయంలో తమ పోరాటాన్ని తీవ్రతరం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రజక సంఘం నాయకుడ మల్లేష్, బీసీవీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నారాయణ స్వామి, బీసీ యువజన కార్యదర్శి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

'దేవర' సందడి



డ్యాన్సు చేస్తున్న అభిమానులు

అనంతపురం, సిటి, సెప్టెంబరు 6 : జూనియర్ ఎన్టీఆర్ నటించిన దేవర సినిమా శుక్రవారం విడుదల నేపథ్యంలో నగరంలో సందడి మొదలైంది. ఎప్పుడెప్పుడా అని ఎదురు చూసిన అభిమానుల కల నేటితో తీరనుంది. దీంతో ఎన్టీఆర్ అభిమానులు గురువారం సాయంత్రం నగరంలోని గౌరి, ఎస్వీ సినీమాక్స్, ఎస్‌మ్యాక్స్, సుధ, వీ మెగా థియేటర్ల వద్ద పెద్దఎత్తున టికెట్‌ల కోసం బారులు తీరారు. ఆయా ప్రాంతాలు అభిమానులతో కిటకిటలాడుతున్నాయి. అభిమానులు డప్పులతో సందడి చేశారు. అభిమానులతో పాటు యువకులు, వృద్ధులు సైతం డ్యాన్సులు చేస్తూ హోరెత్తించారు. మొత్తంగా దేవర సినిమా రాకతో నగరంలోని థియేటర్ల వద్ద ఎన్టీఆర్ అభిమానులు, ప్రేక్షకులతో సందడి నెలకొంది.

రాష్ట్రస్థాయి పోటీలకు అనంతలక్ష్మి స్కూల్ విద్యార్థి



విద్యార్థిని అభినందిస్తున్న అనంతరాముడు

అనంతపురం సెంట్రల్, సెప్టెంబరు 26: రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు అనంతలక్ష్మి ఇంటర్నేషనల్ పాఠశాల విద్యార్థి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా గురువారం పాఠశాల చైర్మన్ అనంతరాముడు విద్యార్థి వినయ్ కుమార్‌ను అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బుధవారం నిర్వహించిన అండర్ - 17 విభాగం ఫుట్‌బాల్ స్కూల్ గేమ్స్ సెలెక్షన్‌లో జిల్లా నుంచి వినయ్‌కుమార్ ఎంపికకావడం అభినందనీయమని కొనియాడారు. తొమ్మిదో తరగతి విద్యార్థి వినయ్‌కుమార్ శనివారం పల్నాడు జిల్లాలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని జిల్లా ఖ్యాతిని చాటాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ రమేష్‌నాయుడు, సీఈఓ నరసింహరావు, ప్రధానోపాధ్యాయురాలు నళిని తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహార మహోత్సవాలు

గార్లదిన్నె, సెప్టెంబరు 26 : మండల కేంద్రంలోని కమ్యూనిటీ హాల్‌లో గురువారం పౌష్టికాహార మహోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఐసీడీఎస్ సీడీపీఓ ఉమాశంకరమ్మ, సూపర్ వైజర్ వాణిశ్రీ, జిల్లా కోఆర్డినేటర్ రామ్మోహన్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. చిరుధాన్యాల ప్రాముఖ్యత, పోషక విలువలతో కూడిన ఆహార పదార్థాలను గురించి వివరించారు. అనంతరం సామూహిక సీమంతాలు, అన్నప్రాసన చేపట్టారు.

సబ్‌జైలు తనిఖీ

కళ్యాణదుర్గంరూరల్, సెప్టెంబరు 26 : పట్టణంలోని సబ్‌జైలును జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ జిల్లా కార్యదర్శి శివప్రసాద్ యాదవ్ గురువారం తనిఖీ చేశారు. ఖైదీల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. భోజన వసతులపై ఆరా తీశారు. స్టాక్ రూము, వంటగదిని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సబ్ జైలు నుంచి బయటకు వెళ్లిన తరువాత ప్రతి ఒక్కరు సత్ప్రవర్తనతో మెలగాలని ఖైదీలకు సూచించారు. సబ్ జైలు సూపరింటెండెంట్ ధనుంజయ నాయు డు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

పోస్టల్ సేవలు సద్వినియోగం చేసుకోండి

కుందుర్పి, సెప్టెంబరు 26 : పోస్టల్ సేవలను వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని పోస్టల్ మేనేజర్ సునీల్ బాబు సూచించారు. మండల కేంద్రంలో గురువారం పోస్టల్ అధికారులు వినియోగదారులతో సమావేశాన్ని నిర్వహించారు. మేనేజర్ సునీల్ బాబు మాట్లాడుతూ పోస్టల్ డిపార్ట్‌మెంట్ వినియోగదారులు ఇంటి ముందుకే అనేక సేవలను అందిస్తోందని తెలిపారు. కరెంటు, నీటి ఫోన్ బిల్లుల చెల్లింపు సౌకర్యం, మొబైల్ బ్యాంకింగ్, పోస్టాఫీసులో గల సంక్షేమ పథకాలు, సుకన్య సమృద్ధి తదితర సేవల గురించి వివరించారు. వినియోగదారులకు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అసిస్టెంట్ మేనేజర్ నవనీత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఉలవల పంపిణీ

బెళుగుప్ప, సెప్టెంబరు 26 : మండలంలోని అంకంపల్లిలో గురువారం రైతులకు సబ్సిడీతో ప్రత్యామ్నాయ విత్తనాలైన ఉలవలను పంపిణీ చేశారు. పది కిలోల ప్యాకెట్‌ను రూ. 200లకు అందజేశారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, సెక్రెటరీ గోపాల్, టీడీపీ నాయకులు శ్రీనివాసులు, ఈశ్వర్, క్రిష్ట, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పీఆర్ డీఈగా మహమ్మద్ రసూల్

ఉరవకొండ, సెప్టెంబరు 26: ఉరవకొండ పంచాయతీ రాజ్ సబ్ డివిజన్ డీఈగా మహమ్మద్ రసూల్ గురువారం బాధ్యతలు చేపట్టారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఈయన అనంతపురం సబ్ డివిజన్ నుంచి ఉరవకొండకు వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న డీఈ అరుణ్‌కుమార్ అనంతపురానికి బదిలీ అయ్యారు.

చెత్త నుంచి సంపదను సృష్టిద్దాం

కుందుర్పి, సెప్టెంబరు 26: చెత్త నుంచి సంపద సృష్టించుకునేందుకు అందరూ పాటు పడదామని ఎంపీడీఓ లక్ష్మీనరసింహ సూచించారు. మండలంలోని యర్రగుంట, మలయ నూరు, బెస్తరపల్లి, కరిగానపల్లి గ్రామాల్లోని చెత్తతో సంపద తయారీ కేంద్రాలను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆయా కేంద్రాలను వాడుక లోకి తెచ్చేందుకు గ్రామ పంచాయతీల కార్యదర్శులు చర్యలు చేపట్టాలని తెలిపారు. చెత్త నుంచి సంపద సృష్టికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని అన్నారు. పంచాయతీ కార్యదర్శులు మహబూబ్ బాషా, రామాంజనేయులు, అశోక్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తరాఖండ్‌లో మండలవాసి ఆత్మహత్య

పుట్లూరు, సెప్టెంబరు 26: మండలంలోని సంజీవపురం గ్రామానికి చెందిన హరినాథ్‌రెడ్డి (25) అనే యువకుడు ఉత్తరాఖండ్‌లో ఆత్మహత్య చేసుకున్నట్లు గ్రామస్థులు తెలిపారు. స్థానికులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. మునిరెడ్డి, లక్ష్మీదేవి దంపతుల కుమారుడు హరినాథ్‌రెడ్డి ఉత్తరాఖండ్‌లోని జెన్‌కోలో ఉద్యోగం చేస్తున్నాడు. కాగా ఆరునెలల నుంచి మానసికస్థితి సరిగా లేకపోవడంతో బుధవారం రాత్రి ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు సమాచారం. మృతదేహాన్ని గురువారం గ్రామానికి తీసుకొచ్చారు.

ఇరువురిపై కేసు నమోదు

గుంతకల్లుటౌన్, సెప్టెంబరు 26: మండలంలోని నాగసముద్రం గ్రామానికి చెందిన ఇరువురిపై కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్ఐ రాఘవేంద్రప్ప గురువారం రాత్రి తెలిపారు. బుధవారం తాగునీటి సరఫరా చేయాలని పంచాయతీ కార్యదర్శి కృష్ణారెడ్డి ద్వారా టీడీపీ నాయకులు తాగునీటి కార్మికుడు రాంబాబును అడిగించారు. అయితే తాగునీటిని వదలనని తిట్టినట్లు తెలిసింది. ఈ విషయమై రాంబాబు ఇంటి వద్దకు టీడీపీ నాయకులు నిలదీయడానికి వెళ్లారు. వారిని కూడా రాంబాబుతో పాటు నరసింహులు నానాదుర్భాషలాడి దాడి చేశారు. ఈ మేరకు టీడీపీ నాయకులు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాఘవేంద్రప్ప తెలిపారు.

ఘనంగా చాకలి ఐలమ్మ జయంతి

తాడిపత్రి, సెప్టెంబరు 26: పట్టణంలోని గాంధీసర్కిల్‌లో గురువారం తెలంగాణా సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను రజకవృత్తిదారులు నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రంగయ్య, పట్టణ కార్యదర్శి చిరంజీవి యాదవ్ హాజరై ఆమె చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. పలువురు మాట్లాడుతూ భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరీ నుంచి విముక్తి కోసం పోరాడిన వీర వనిత చాకలి ఐలమ్మ అని కొనియాడారు. తెలంగాణా జమీందారులు, నవాబులకు వ్యతిరేకంగా పోరాడి కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో 10లక్షల ఎకరాలను పేదలకు పంచిపెట్టిందని గుర్తు చేశారు. రజకవృత్తిదారుల సమాఖ్య నాయకులు సూరి, శ్రీరాములు మాట్లాడుతూ ఏపీ ప్రభుత్వం ఐలమ్మ వర్ధంతి, జయంతి కార్యక్రమాలను నిర్వహించాలని డిమాండ్‌చేశారు.

50 చీనీచెట్ల నరికివేత

పెద్దపప్పూరు, సెప్టెంబరు 26: మండలంలోని రెడ్డిపల్లి గ్రామానికి చెందిన మహిళా రైతు వెంకటలక్ష్మీ తోటలో గురువారం తెల్లవారుజామున గుర్తుతెలియని దుండగులు 50చీనీచెట్లను నరికివేశారు. సమాచారం అందుకున్న పోలీసులు నరికివేతకు గురైన చెట్లను పరిశీలించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మహమ్మద్‌గౌస్‌బాషా తెలిపారు.

భక్తిశ్రద్ధలతో తిరుమంజన స్నపనం

గుంతకల్లు, సెప్టెంబరు26: పునర్వసు తిరు నక్షత్ర సంక్రమణాన్ని పురస్కరించుకుని కసాపురంలోని నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో గురువారం ఉదయం తిరుమంజన స్నపన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారామలక్ష్మణ సమేత ఆంజనేయ స్వామివార్ల ఉత్సవ విగ్రహాలకు తిరుమంజన స్నపనం నిర్వహించి అలంకారాలు, అర్చనలు చేశారు. కార్యక్రమంలో ఆలయ వేద పండితుడు రామకృష్ణావధాని, అర్చకులు పాల్గొన్నారు.

మత్స్య సహకార సంఘం ఏర్పాటుకు విచారణ

గుమ్మఘట్ట, సెప్టెంబరు 26: మండలంలోని కలుగోడు గ్రామంలో గల చెరువులో చేపలు వేటాడే మత్స్యకారులకు సహకార సంఘం ఏర్పాటు చేసుకునేందుకు మత్స్యకారులు జిల్లా అధికారులకు ఇటీవల వినతి చేశారు. దీంతో జిల్లా అధికారుల ఆదేశాల మేరకు గురువారం సాయంత్రం బీటీపీ మత్స్యశాఖ అధికారి సత్యనారాయణ మండలకేంద్రంలో మత్స్యకారులతో సమావేశం ఏర్పాటు చేశారు. సంఘం ఏర్పాటుకు అర్హత కలిగిన మత్స్యకారుల వివరాలను సేకరించి ఉన్నతాధికారులకు పంపనున్నట్లు తెలిపారు.

బడుగు, బలహీనవర్గాల ద్రోహి జగన్

● ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి సవిత


కణేకల్లు సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సవిత

కణేకల్లు, సెప్టెంబరు 26: బడుగు, బలహీనవర్గాల ద్రోహి వైఎస్ జగన్ అని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖా మంత్రి సవిత పేర్కొన్నారు. మండల కేంద్రంలో గురువారం జరిగిన ఇదిమంచి ప్రభుత్వం కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో వైఎస్ జగన్ బీసీలను అణగదొక్కారన్నారు. వారి సంక్షేమానికి ఎలాంటి కృషి చేయలేదన్నారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చిన వందరోజుల్లోనే అన్ని వర్గాలకు న్యాయం చేసే విధంగా పాలన సాగించి అందరి చేత మన్ననలు పొందుతున్నా రన్నారు. త్వరలోనే బడుగు, బలహీన వర్గాల కార్పొరేషన్ పదవులను కూడా భర్తీ చేయనున్నట్లు చెప్పారు. ప్రతి జిల్లా కేంద్రంలోనూ బీసీ భవనాలను నిర్మించి నిరుద్యోగ బీసీ యువతకు డీఎస్సీ కోచింగ్ కూడా ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రజా సంక్షేమ పాలన అందించడం చంద్రబాబుకే సాధ్యమన్నారు. కణేకల్లు ప్రజల కలగా ఉన్న బ్రిడ్జి నిర్మాణాన్ని రూ. 48 కోట్ల వ్యయంతో త్వరలోనే ప్రారంభించనున్నట్లు ఈ సందర్భంగా పేర్కొన్నారు. అలాగే నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులన్నింటినీ త్వరితగతిన పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఫణికుమార్, ఎంపీడీఓ శ్రీనివాసులు, ఏఓ శ్రావణ్, ఏపీఓ గోవిందప్ప, ఏసీ గంగాధర, టీడీపీ నాయకులు లాలెప్ప, ఆనంద్‌రాజ్, వేలూరు మరియప్ప, బీటీ రమేష్, బసవరాజు, కోళకుర్తి సుదర్శన్, చంద్రశేఖర్‌గుప్తా, బాయినేని నవీన్, తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణం ఆగిన ఎంజేబీ పాఠశాల భవనం పరిశీలన

గుమ్మఘట్ట: మండలంలోని గోనబావి గ్రామం వద్ద ఉన్న ఆగిన ఎంజేబీ పాఠశాల భవన నిర్మాణాన్ని మంత్రి సవిత, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పరిశీలించారు. అనంతరం తాత్కాలిక షెడ్డులో ఉన్న విద్యార్థుల సమస్యలను తెలుసుకుని గత ప్రభుత్వ నియంతృత్వ ధోరణిపై మండిపడ్డారు. వైసీపీ ప్రభుత్వం బీసీల అభివృద్ధిని అడ్డుకుంటూ వచ్చిందన్నారు. వచ్చే విద్యాసంవత్సరం నాటికి ఈ పాఠశాల భవనాల నిర్మాణాలను పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. రాబోయే రోజులలో ఇక్కడి బాలికల పాఠశాలను కళాశాలలుగా మార్చి విద్యాభివృద్ధికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ గిరిమల్లప్ప, క్లస్టర్ ఇన్‌చార్జ్ కాలవ సన్నన్న, తెలుగుయువత రమేష్, దుర్గేష్, ఎంజేబీ పాఠశాల కన్వీనర్ సంగీతకుమారి, ప్రిన్సిపాల్ శ్రీదేవి, తహశీల్దార్ శ్రీనివాసులు, వివిధ శాఖల అధికారులు, సర్పంచులు, టీడీపీ నాయకులు తపాల్గొన్నారు.

చేనేత కార్మికులను ఆదుకోవాలని వినతి

రాయదుర్గంరూరల్: పట్టణంలో చేనేత కార్మికులు జీన్స్ పరిశ్రమపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారని, వారికి రుణాలు ఇచ్చి ఆదుకోవాలని సీపీఐ పట్టణ కార్యదర్శి కొట్రేష్ మంత్రి సవితను కోరారు. 74 ఉడేగోళం గ్రామం వద్ద ఉన్న టెక్స్‌టైల్స్ పార్క్‌ను మంత్రి సవిత, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు సందర్శించారు. ఈ సందర్భంగా సీపీఐ పట్టణ కార్యదర్శి మంత్రిని కలిసి చేనేత కార్మికుల సమస్యలను వివరించారు. పనుల్లేక చాలా మంది చేనేత కార్మికులు వృత్తిని వదిలేసి ఇతర చిరువ్యాపారాలు చేసుకుంటూ, కూలీకి వెళ్లూ జీవనం సాగిస్తున్నారన్నారు. చేనేత ముడి సరుకుల ధరలు పెరగడంతో గిట్టుబాటు గాక చాలామంది చేనేత వృత్తిని వదిలేశారన్నారు. ఉన్న కొద్దిమందికి ప్రభుత్వ సహాయ సహకారాలు సరిగా అందక జీవనం కష్టంగా ఉందన్నారు. గత ప్రభుత్వం చేనేతల కుటుంబాలను పట్టించుకోలేదన్నారు. మీరు అయినా స్పందించి సబ్సిడీ రుణాలు ఇచ్చి ఆదుకోవాలని కోరారు. అనంతరం వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే గ్రామాల అభివృద్ధి: ఎమ్మెల్యే గుమ్మనూరు


జక్కలచెరువులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం,


వ్యాసాపురంలో స్టిక్కర్లను ప్రదర్శిస్తున్న టీడీపీ నాయకులు

గుత్తి రూరల్, సెప్టెంబరు 26 : సీఎం చంద్రబాబుతోనే గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం అన్నారు. మండలంలోని జక్కలచెరువు గ్రామంలో గురువారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికి ఎమ్మెల్యే జయరాంతో పాటు టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే సీఎం చంద్రబాబు అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. మిగిలిన వాటిని త్వరలోనే అమలు చేస్తారన్నారు. గ్రామాల అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యమన్నారు. గుత్తి మండలానికి రూ. 3కోట్ల నిధులతో సీసీరోడ్లు, డ్రైనేజీలు మంజూరయ్యాయన్నారు. వెంకట శివుడు యాదవ్ మాట్లాడుతూ చంద్రబాబు సీఎం అయ్యాక రాష్ట్రం అభివృద్ధి లో పరుగులు తీస్తోందని తెలిపారు. అనంతరం రూ.13.50లక్షలతో జక్కులచెరువులో సీసీరోడ్ల నిర్మాణానికి శిలాఫలకాన్ని వారు ఆవిష్కరించారు. అలాగే డ్వాక్రా మహిళలకు రూ. 14లక్షల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల ఇన్‌చార్జి గుమ్మనూరు నారాయణ, నాయకులు నారాయణస్వామి, గుమ్మనూరు ఈశ్వర్, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి మణికంఠ, ఆర్డీఓ శ్రీనివాసరెడ్డి, తహసీల్దార్ ఓబులేసు, సర్పంచు సుహాసిని, ఎంపీటీసీలు జింకల నారాయణస్వామి, ధనుంజయ, గోవర్ధన్‌గౌడ్, రామాంజి, రమేష్ , టీడీపీ శ్రేణులు పాల్గొన్నారు.

గ్రామాల్లో 'ఇది మంచి ప్రభుత్వం'

ఉరవకొండ: నియోజకవర్గంలోని వ్యాసాపురం, పీసీ ప్యాపిలి గ్రామాల్లో గురువారం టీడీపీ నాయకులు సీతారాములు, గోనుగుంట్ల నాగేంద్ర వేర్వేరుగా ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి వందరోజుల్లో కూటమి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి కరపత్రాలను పంపిణీ చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటై వందరోజులు పూర్తయిందని, ఇంత తక్కువ కాలంలోనే సీఎం చంద్రబాబు ప్రజలకు ఎంతో మేలు చేకూర్చేలా పాలన అందించారని తెలిపారు. అలాగే గోడలకు కార్యక్రమ స్టిక్కర్లను అతికించారు. కార్యక్రమాలలో మాజీ ఎంపీ టీసీ నాగన్న, నాయకులు కాడెప్ప, సుంకన్న, వన్నూరుస్వామి, సుంకే నాయక్, టీఎన్ఎస్ఎఫ్ నాయకులు సుధాకర్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

బొమ్మనహాళ్: మండలంలోని దర్గాహొన్నూరులో ఇది మంచి ప్రభుత్వ కార్యక్రమాన్ని నిర్వహించారు. టీడీపీ బీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు కేశప్ప, నాయకులు నాగరాజు, వీఎల్ రామాంజనేయులు, రఫీ, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దవడుగూరు: మండలంలోని ఆవులాంపల్లి గ్రామంలో ఇది మంచి ప్రభుత్వ కార్యక్రమం జరిగింది. ఇందులో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు కేశవరెడ్డి , సీనియర్ నాయకులు బాలిరెడ్డి, చితంబరరెడ్డి, అధికారులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బ్రహ్మసముద్రం : మండల కేంద్రంలోని సచివాలయం వద్ద ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. టీడీపీ మండల కన్వీనర్ పాలబండ్ల శ్రీరాములు, ఎంచాయతీ కార్యదర్శి మురళి, డీటీ శ్రీనాథ్‌రెడ్డి, వీఆర్వో వేణు, మాజీ ఎంపీపీ మంజుల వన్నూరుస్వామి, సంతేకొండాపురం సర్పంచ్ మల్లికార్జున, నాయకులు వెంకటేశులు, పరమేష్ గౌడ్, కెంచప్ప, శివప్ప, క్రిష్ణ, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

గుంతకల్లు: పట్టణంలోని 15వ వార్డులోని మున్సిపల్ బాలికోన్నత పాఠశాల ఆవరణలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. టీడీపీ నాయకుడు గుమ్మనూరు నారాయణ స్వామి మాట్లాడుతూ చంద్రబాబు అధికారంలోకి వచ్చిన అతి తక్కువ కాలంలోనే పలు సంక్షేమ పథకాలను విజయవంతంగా అమలు చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు బండారు ఆనంద్, నాయకులు బీఎస్ కృష్ణారెడ్డి, ఆమ్లెట్ మస్తాన్ యాదవ్, గుమ్మనూరు వెంకటేశులు, పత్తి హిమబిందు, తలారి మస్తానప్ప, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

తాడిపత్రి: పట్టణంలోని శ్రీనివాసపురం, నందలపాడు, భగత్‌సింగ్‌నగర్, ఆసుపత్రిపాలెం, గాజులక్రిష్టప్పవీధి, కాల్వగడ్డవీధి, శ్రీరాములపేట తదితర కాలనీల్లో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. కౌన్సిలర్లు విజయకుమార్, మల్లికార్జున, జింకా లక్ష్మీదేవి, రేష్మాపర్వీన్, లక్ష్మీనారాయణ, సుశీల తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా తీజ్ ఉత్సవాలు


ఉత్సవాలలో పాల్గొన్న గిరిజన మహిళలు

ఉరవకొండ, సెప్టెంబరు 26: వజ్రకరూరు మండలం వెంకటాంపల్లి పెద్ద తండాలో తీజ్ ఉత్సవాలు ఉత్సాహంగా సాగాయి. ఈ ఉత్సవాలను 11రోజుల పాటు నిర్వహించారు. చివరి రోజు గురువారం జరిగిన ఉత్సవాల్లో గిరిజన మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. స్థానిక గురునానక్ ఆలయం, తుల్జాభవాని ఆలయాల్లో ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం సాయంత్రం సాంప్రదాయ నృత్యాలు చేశారు. వెదురు బుట్టలలో ఉన్న తీజ్ మొక్కలను తొలగించి కులపెద్దల ఎర్రతలపాగులో గోధుమ మొక్కలను ఉంచారు. తర్వాత బుట్టలను నెత్తిన పెట్టుకుని, గ్రామసమీపంలో ఉన్న బావిలో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో బంజారా సంఘం నాయకులు కేశవ్‌నాయక్, దాసునాయక్, తులసిదాస్ నాయక్, కమల్‌సింగ్ రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

కాళాపురంలో ఎనుములు, ఆవులు చోరీ

పామిడి, సెప్టెంబరు 26: మండలంలోని కాళాపురం గ్రామంలో రైతు రఘునాథ్‌రెడ్డికి చెందిన ఎనుములు, ఆవులు బుధవారం రాత్రి చోరీ అయ్యాయి. స్థానికుల వివరాల మేరకు... కాళాపురం గ్రామానికి చెందిన రఘునాథ్‌రెడ్డి వ్యవసాయంతో పాటు పాడి ఎనుములు, ఆవులు ఉన్నాయి. కాగా రాత్రి సమయంలో ఇంటి బయట ఉన్న సుమారు రూ.3లక్షలు విలువ గల రెండు ఎనుములు, రెండు ఆవులను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. తెల్లవారుజామున పశువులు లేకపోవడాన్ని గుర్తించిన రఘునాథ్‌రెడ్డి ఉదయం మండలకేంద్రంలోని పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

రోడ్లు, కల్వర్టులు నిర్మించాలని వినతి

గుత్తి, సెప్టెంబరు 26: చెట్నేపల్లిలో గల జగనన్న కాలనీలో రోడ్లు, కల్వర్టులు నిర్మించాలని కోరుతూ గురువారం మున్సిపల్ కమిషనర్ జబ్బర్‌మీయాకు ఆ కాలనీ వాసులు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో కాలనీవాసులు వెంకటేష్, జగదీష్, నరేష్, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఈ క్రాప్ నమోదు చేయలేదెందుకో..!

● రైతుసేవాకేంద్రం చుట్టూ పలుమార్లు తిరిగినా ఫలితం శూన్యం
● పలు గ్రామాల రైతుల గగ్గోలు
● నమోదు గడువు పెంచాలని విజ్ఞప్తి


తమ పంటలు ఈ క్రాప్ చేయలేదని కూడేరు ఆర్ఎస్‌కేలో మొర పెట్టుకుంటున్న రైతులు (ఫైల్)

కూడేరు, సెప్టెంబరు 26: తమ భూముల్లో సాగు చేసిన పంటలను ఈ క్రాప్ నమోదు చేయలేదని మండలంలోని పలు గ్రామాలతో పాటు కూడేరు పరిధిలోని పొలాల్లో పంటలు సాగు చేసిన వివిధ ప్రాంతాల రైతులు గగ్గోలు పెడుతున్నారు. గత రెండ్రోజులుగా మండల కేంద్రంలోని రైతుసేవా కేంద్రం వద్దకు స్థానిక రైతులతో పాటు తలుపూరు, సింగంపల్లి తండా, సింగంపల్లి, కదదరకుంట గ్రామాల రైతులు వచ్చి ఈ క్రాప్ నమో దు చేయించాలని ఏఈఓ వద్ద మొర పెట్టుకుంటున్నారు. వ్యవ సాయ శాఖ సిబ్బంది సకాలంలో ఈ క్రాప్ నమోదు చేయకపోవడంతో కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నామని వాపోతున్నారు. ఈ క్రాప్ నమోదుకు ఈనెల 23వ తేదీతో గడువు ముగిసిందని, అయితే తమ పంట లను ఇంత వరకు ఈ క్రాప్ నమోదు చేయలేదని ఆవేదన చెందుతున్నారు. గ్రామాల్లో వ్యవసాయశాఖ సిబ్బంది ఎప్పుడు వస్తారో, ఎప్పుడు వెళ్తున్నారో తెలియ దంటున్నారు. తాము సాగు చేసిన పంటలకు ఈ క్రాప్ నమోదు చేయక పోతే ఎలాగని, ఈ ఏడాది ప్రభుత్వం పంటలకు పరిహారం ప్రకటిస్తే తమకు వర్తించదని, అధికారుల నిర్లక్ష్యం కారణంతోనే ఇలా జరిగిందని వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఈ క్రాప్ నమోదు గడువు పెంచాలని వారు కోరుతున్నారు.

ఎవరూ పట్టించుకోలేదు..



తాను కూడేరు పొలంలోని మూడెకరాల్లో వేరుశనగ సాగు చేశా.. ఆ పంటకు ఈ క్రాప్ నమోదు చేయలేదు. చేయాలని అధికారుల చుట్టూ తిరిగినా పట్టించుకునే వారే కరువయ్యారు. పంట నమోదుకు గడువు ముగియడంతో దిక్కుతోచడం లేదు.

- పెద్దన్న, రైతు, తలుపూరు

సర్వర్ పనిచేయలేదని చెప్పారు..



పంటను ఈ క్రాప్ చేయాలని వ్యవసాయాధికారులను అడిగితే సర్వర్ పనిచేయడం లేదని చెప్పారు. తాను కూడేరు పొలంలో వేరుశనగ సాగు చేశా. ఈ క్రాప్ నమోదు చేయకపోతే పరిహారం రాదని తెలిసింది. కనుక ఈ క్రాప్ నమోదు చేయాలని కార్యాలయం చుట్టూ పలుమార్లు తిరిగినా ఫలితం లేదు.

- రాములమ్మ, రైతు, సింగంపల్లి తండా

గడువు పెంచాలి



రెండు ఎకరాల్లో బ్యాడిగ మిరప, మరో రెండు ఎకరాల్లో కంది సాగు చేశా. పంట నమోదు చేయాలని కోరినా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఈ ఏడాది వర్షాలు అధికంగా వస్తున్నాయి. పంట నష్టపోతే.. ప్రభుత్వం పరిహారం ప్రకటిస్తే మాకు వర్తించదు. ఉన్నాతాధికారులు స్పందించి ఈ క్రాప్ నమోదు గడువు పెంచాలి.

- చంద్రశేఖర్, రైతు, కడదరకుంట

రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక


రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థితో హెచ్ఎం తదితరులు

కళ్యాణదుర్గంరూరల్, సెప్టెంబరు 26: మండలంలోని చాపిరి ఉన్నత పాఠశాల విద్యార్థి శ్రీహరి రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యాడు. ఈ నెల 25వ తేదీ అనంతపురం జిల్లాకేంద్రంలో జరిగిన అండర్-17 జిల్లాస్థాయి పోటీలలో శ్రీహరి అత్యంత ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం నరసింహప్ప, గురువారం తెలిపారు. ఈ నెల 28 తేదీ నుంచి పల్నాడు జిల్లా వినుకొండలో జరుగు రాష్ట్రస్థాయి పోటీలలో విద్యార్థి పాల్గొననున్నట్లు చెప్పారు. విద్యార్థిని హెచ్ఎంతో పాటు పీడీ మురళి, అధ్యాపక బృందం అభినందించారు.

జిల్లాస్థాయి చెస్ పోటీలకు యాడికి విద్యార్థులు

యాడికి: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గేమ్స్‌లో యాడికిలోని విజన్ స్కూల్‌కు చెందిన లహరి, దీపిక జిల్లాస్థాయి చెస్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల కరెస్పాండెంట్ విశ్వనాథ్ తెలిపారు. తాడిపత్రిలో గురువారం నిర్వహించిన నియోజకవర్గస్థాయి అండర్-17 బాలికల చెస్ పోటీల్లో లహరి, దీపిక ప్రతిభను కనబరిచి మొదటి, రెండో స్థానాల్లో నిలిచారన్నారు. వీరు జిల్లాస్థాయిలో నిర్వహించే చెస్ పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఈవిద్యార్థినులను పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

వాలీబాల్ పోటీల్లో మోడల్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ

పుట్లూరు: బుక్కరాయసముద్రం సమీపంలో ఉన్న కొర్రపాడులో జరిగిన వాలీబాల్ అండర్-14 బాలుర విభాగంలో మండలంలోని మోడల్ స్కూల్ విద్యార్థులు విజేతగా నిలిచారని ప్రిన్సిపాల్ ఓబులరెడ్డి తెలిపారు. నియోజకవర్గస్థాయి పోటీల్లో పాల్గొన్న పాఠశాల విద్యార్థులు అత్యంత ప్రతిభ చూపి విజేతలుగా నిలిచారన్నారు. గెలుపొందిన విద్యార్థులను ప్రిన్సిపాల్‌తోపాటు ఉపాధ్యాయులు అభినందించారు.

మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

తాడిపత్రి, సెప్టెంబరు 26: మోసాలు, దొంగతనాలు, దోపిడీల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రూరల్ సీఐ శివగంగాధర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో సూచించారు. ఇళ్లకు తాళాలు వేసి ఊళ్లకు వెళ్లే సమయంలో ఇంటిలో విలువైన ఆభరణాలు ఉంచరాదని తెలిపారు. ఆన్‌లైన్‌లో జరుగుతున్న మోసాలపట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. అపరిచిత వ్యక్తుల ఫోన్‌కాల్ పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. గ్రామాల్లో ఎవరైనా కొత్త వ్యక్తులు కనిపించినా, అసాంఘిక కార్యకలాపాలు జరిగినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ఇంటిలో ఉన్న ఒంటరి మహిళలను దొంగలు టార్గెట్ చేస్తూ మెడలోని బంగారాన్ని లాక్కెళ్లడం, గాయపరచడం, భయపెట్టడం జరుగుతోందన్నారు. ఇలాం టి వాటిపట్ల జాగ్రత్తగా ఉండాలని సీఐ సూచించారు. ఎలాంటి సమాచారం ఉన్నా 9440796863, 9346917081కు ఫోన్‌చేయాలని ఆయన ప్రజలను కోరారు.

జీడిపల్లికి 965 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, సెప్టెంబరు 26 : మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు గురువారం కృష్ణాజలాల ఇన్‌ఫ్లో 965 క్యూసెక్కులు ఉన్నట్లు హంద్రీనీవా అధికారులు తెలిపారు. అలాగే ఔట్‌ఫ్లో కింద హెచ్ఎన్ఎస్ఎస్ ఫేజ్-2కు 890 క్యూసెక్కులు వెళుతున్నాయని, ప్రస్తుతం రిజర్వాయరులో 1.666 టీఎంసీలు నీటి నిల్వ ఉందని వెల్లడించారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సన్మానం


సన్మానం పొందిన ఉత్తమ ఉపాధ్యాయులు

విడపనకల్లు, సెప్టెంబరు 26: మండలకేంద్రంతో పాటు ఆర్ కొట్టాల గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ల్లో విధులు నిర్వర్తిస్తున్న ఉపాధ్యాయులు శ్రీనివాసులు, భాస్కర్ ఇటీవల జరిగిన ఉపాధ్యాయ దినోత్సవంలో జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు పొందారు. ఇందుకు గాను వారిని మండల ఉపాధ్యాయులందరూ గురువారం ఘనంగా సన్మానించారు. మండల కేంద్రంలోనే ఉత్తమ ఉపాధ్యాయులను, వారి సతీమణులను పూలమాలలు, శాలవాలతో సన్మానించారు. వారి కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

చురుగ్గా నీటి పంపింగ్

ఉరవకొండ,సెప్టెంబరు 26: మండలంలోని నింబగల్లు సమ్మర్‌స్టోరేజీ ట్యాంకులోకి నీటి పంపింగ్ చురుగ్గా సాగుతోంది. ఈ ఏడాది ఉరవకొండలో తాగు నీటి ఎద్దడి ఏర్పడడంతో మంత్రి పయ్యావుల కేశవ్ ప్రత్యేక చొరవ తీసుకుని హెచ్చెల్సీ కాలువలకు నీరు విడుదల కాగానే, పంపింగ్ చేపట్టేలా అధికారులకు ఆదేశించారు. దీంతో అధికారులు ఐదు మోటార్ల ద్వారా పంపింగ్ చేపట్టి, నీటి ఎద్దడి కలగకుండా చర్యలు తీసుకున్నారు. ఇప్పటికే 15 అడుగుల ఎస్ఎస్‌ట్యాంకులోకి 10అడుగుల వరకూ నీటిని నింపినట్లు అధికారులు తెలిపారు. ఉరవకొండకు తాగు నీటి సమస్య తలెత్తకుండా అన్ని చర్యలు చేపట్టినట్లు డీఈ షఫీన్ పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

బెళుగుప్ప, సెప్టెంబరు 26: మండలంలోని బ్రాహ్మణపల్లి సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఉద్దేహాళ్‌కు చెందిన బాషా, షకీలాకు తీవ్ర గాయాలయ్యాయి. వారిద్దరూ కళ్యాణదుర్గానికి బైకుపై వెళుతుండగా బ్రాహ్మణపల్లి సమీపంలో కుక్క అడ్డుగా రావడంతో తప్పించబోయి అదుపుతప్పి రోడ్డుపక్కన డివైడర్‌ను ఢీకొన్నారు. ప్రమాదంలో ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు 108 వాహనంలో వారిని కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

వేపరాల క్రాస్ వద్ద ఒకరికి..

రాయదుర్గంరూరల్, సెప్టెంబరు 26: మండలంలోని వేపరాలక్రాస్ వద్ద చెరువు కట్ట కింద గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. కణేకల్లు మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన తిప్పేస్వామి వ్యక్తిగత పని నిమిత్తం బైక్‌పై కళ్యాణదుర్గానికి బయలుదేరాడు. కాగా వేపరాల క్రాస్ వద్ద ఎదురుగా యూరియా లోడ్‌తో వస్తున్న లారీ ప్రమాదవశాత్తూ ఢీకొంది. ప్రమాదంలో తిప్పేస్వామికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి కళ్యాణదుర్గం ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేయాల్సి ఉంది.

ఎడ్ల బండి దూసుకొచ్చి వృద్ధురాలికి ..

బొమ్మనహాళ్, సెప్టెంబరు 26: ఎద్దుల బండి మీదకు దూసుకురావడంతో మండలంలోని ఉంతకల్లు గ్రామంలో ఓ వృద్ధురాలు తీవ్రంగా గాయపడింది. ఈ సంఘటన గురువారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గ్రామస్థులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. పెద్దభీమక్క అనే వృద్ధురాలు ఈ నెల 20వ తేదీన గ్రా మంలో ఓ దుకాణం వద్ద కూర్చుని ఉంది. అదే సమయంలో బసవరాజుకు చెందిన ఎద్దుల బండి వస్తూ ఒ క్కసారిగా ఆమెపైకి దూసుకెళ్లింది. దీంతో తీవ్రంగా గాయపడింది. బళ్లారి విమ్స్‌లో చికిత్స పొందుతోందని, పరిస్థితి విషమంగా ఉందని గ్రామస్థులు తెలిపారు. సంఘటనపై గురువారం బొమ్మనహాళ్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు పెద్ద భీమక్క కుమారుడు శంకర్ తెలిపారు. .

కల్యం పరిసర ప్రాంతాల్లో చిరుత సంచారం

● భయాందోళనలో గ్రామస్థులు

డీ.హీరేహాళ్, సెప్టెంబరు 26: కల్యం గ్రామ పరిసర ప్రాంతాల్లో ఉన్న కొండలలో చిరుత సంచరిస్తోంది. దీంతో గ్రామస్థులు భయాందోళన చెందుతున్నారు. గ్రామ సమీపంలోనే ఉన్న ఒక కొండపై గురువారం ఉదయం చిరుత ఉండడం పలువురు గ్రామస్థులు గమనించారు. కల్యం గ్రామ సమీపంలో చుట్టు ప్రక్కల కొం డలు చాలా ఉన్నాయి. ఆ ప్రాంతంలోనే చిరుత సంచరిస్తోంది. చిరుత కనిపించడంతో అటువైపు వెళ్లేందుకు గ్రామస్థులు భయపడుతున్నారు. వెంటనే అటవీశాఖ అధికారులు చర్యలు చేపట్టి ఆ చిరుత నుండి ఎటువంటి అపాయం జరగకుండా చూడాలని గ్రామస్థులు కోరుకుంటున్నారు.